“ మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

“ మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 28-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 329 Issue: 329

28 మే 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:45 సూర్యాస్తమయం - సా. 6:41 తిథి ద్వాదశి ఉ. 7:57 వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం చిత్తా ఉ. 8:03 వరకు తరువాత స్వాతి యోగం వారియ తె. 3:48o వరకు కరణం భాలవ ఉ. 7:57 వరకు కౌలవ రా. 8:53 వరకు వర్జ్యం మ. 2:19 నుండి సా. 4:05 వరకు దుర్ముహూర్తం ఉ. 10:04 నుండి ఉ. 10:55 వరకు మ. 3:14 నుండి సా. 4:06 వరకు రాహుకాలం మ. 1:50 నుండి మ. 3:27 వరకు యమగండం తె. 5:45 నుండి ఉ. 7:22 వరకు గుళికాకాలం ఉ. 8:59 నుండి ఉ. 10:36 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:09 నుండి తె. 4:57 వరకు అమృత ఘడియలు రా. 12:54 నుండి రా. 2:40 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:39 వరకు గమనిక: “o” అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

## శాంసంగ్ ఉద్యోగులకు మేత




### ఒక్కొక్కరికి రూ.3.25 కోట్ల బోనస్

### 78 వేల మందికి ఇవ్వనున్నట్లు ప్రకటన

ప్రముఖ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ తమ ఉద్యోగులకు భారీ కానుక ప్రకటించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో నెలకొన్న అనూహ్యమైన వృద్ధి కారణంగా కంపెనీ చిప్ విభాగం లాభాల పంట పండించడంతో ఆ ఫలాలను ఉద్యోగులతో పంచుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా చిప్ డివిజన్‌లోని ప్రతి ఉద్యోగికి సగటున 3,40,000 డాలర్లు (దాదాపు రూ. 3.25 కోట్లు) బోనస్‌గా అందనుంది. ఈ మేరకు కంపెనీ యాజమాన్యానికి, కార్మిక సంఘానికి మధ్య కుదిరిన ఒప్పందానికి ఉద్యోగుల నుంచి ఆమోదం లభించింది.

2

## ఎయిరిండియా సర్వీసుల కోత




2

### ఇంధన ధరల భారంతో నిర్ణయం

### జూలై, ఆగస్టు నెలల కోటా కుదింపు

జూలై, ఆగస్టు నెలల్లో ఎయిరిండియా విమానాల్లో ప్రయాణించాలనుకునే వారికి కొన్ని రూట్లలో ఆప్షన్లు తగ్గనున్నాయి. ఇప్పుడు దేశీయ విమాన సర్వీసులను కూడా తగ్గించాలని సంస్థ నిర్ణయించింది. విమాన ఇంధన ధరలు భారీగా పెరగడమే ఇందుకు కారణమని విమానయాన వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ముఖ్యంగా ఇరాన్ సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా విమాన ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. దీంతో ఎయిరిండియా జూలై, ఆగస్టు నెలల్లో తన దేశీయ విమాన సర్వీసులను 15 నుంచి 20 శాతం వరకు తగ్గించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# సర్.. మీరు కరెక్టే!



## ఓటరు జాబితా సవరణకు సుప్రీం గ్రీన్ సిగ్నల్

### ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సమర్థించిన సుప్రీంకోర్టు

### మే 30 నుంచి ఆఖరి విడత ప్రక్రియ

### నిబంధనల ప్రకారమే ఈసీ చర్యలని స్పష్టీకరణ



ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు బుధవారం సంచలన తీర్పునిచ్చింది. సాధారణ సవరణ విధానానికి భిన్నంగా ఉందనే ఒకే ఒక్క కారణంతో ఈ ప్రత్యేక ప్రక్రియను రద్దు చేయలేమని స్పష్టం చేసింది.

న్యూఢిల్లీ: మే 30 నుంచి దేశవ్యాప్తంగా మూడో విడత సవరణలు ప్రారంభం కానున్న తరుణంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలోని తరువాయి 2 వ పేజీలో...

## “ సర్ వల్లే మమత, స్టాలిన్ ఓటమి: జగన్



ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో భారీ ఎత్తున ఓట్లను తొలగించడం వల్లే మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్ వంటి కీలక నేతలు సైతం తమ నియోజకవర్గాల్లో ఓటమి పాలయ్యారని సంచలన ఆరోపణలు చేశారు.

తాడేపల్లి, మే 27 (ఈవార్తలు): ఇదే తరహా ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనూ జరగనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో ఆయన ఈ తరువాయి 2 వ పేజీలో...



## కెనడాలో 17 మంది ప్రవాసుల అరెస్టు

కెనడాలో స్థిరపడిన దక్షిణాసియా వ్యాపారవేత్తలు, స్థానిక వలసదారులను లక్ష్యంగా చేసుకుని దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడుతున్న ఒక భారీ అంతర్జాతీయ వ్యవస్థీకృత నేర ముఠా ఆట కట్టించారు అక్కడి పోలీసులు.

ఒట్టావా: వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేసి భారీగా డబ్బులు వసూలు చేస్తున్న కేసులో భారత సంతతికి చెందినట్లు భావిస్తున్న 17 మంది పురుషులను కెనడా రక్షక దళాలు మంగళ వారం అరెస్ట్ చేశాయి. ఈ ముఠా అరెస్టుతో ఒక పెద్ద క్రిమినల్ నెట్‌వర్క్ వెలుగులోకి వచ్చినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. గత కొంతకాలంగా పీల్ రీజియన్ తరువాయి 2 వ పేజీలో...



## బైజూస్ రవీంద్రన్‌కు ఆర్నెల్ల జైలు

### సింగపూర్ కోర్టు సంచలన తీర్పు

సింగపూర్: ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ ‘బైజూస్’ వ్యవస్థాపకుడు రవీంద్రన్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన కేసులో ఆయనకు సింగపూర్ కోర్టు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. ఒకప్పుడు స్టార్టప్ ప్రపంచంలో బిలియనీర్‌గా వెలిగిన రవీంద్రన్, తన ఆస్తుల వివరాలను దాచడంతో న్యాయస్థానం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. బైజూస్ తీవ్ర నష్టాల్లో ఉన్న సమయంలో ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ తరువాయి 2 వ పేజీలో...



### బంగారం-వెండి ధరలు

| బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో) | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,829 |
| వెండి (కిలో): | రూ.2,90,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,895 |

### విశ్వవాణి



శృంగారానికి ఆడ కోవాలా ‘వద్దు’ అని చెప్పితే, మగ కోవాలా వాదించదు. ఏమీ అనకుండా పక్కకు వెళ్లి 22 గంటలపాటు నిద్రలోకి జారుకుంటుంది. ఎందుకంటే.. ఇవి తినే యూకలిప్టస్ ఆకుల్లో పోషకాలు తక్కువగా ఉంటాయి. అందుకే శక్తిని ఆదా చేసుకోవడం అవసరం. ఆడ కోవాలాకు ఆసక్తి లేకపోతే, మగ కోవాలాలు వెంటపడుతూ శక్తిని వృథా చేయవు. బదులుగా అవి వెనక్కి వెళ్లి విశ్రాంతి తీసుకుంటాయి, తద్వారా మరో అవకాశం కోసం శక్తిని దాచుకుంటాయి.



## డిజి పల్లెలు

### ఇంటింటికీ హైస్పీడ్ ఇంటర్నెట్

### తొలిదశలో 3,089 గ్రామాలకు కనెక్టివిటీ

### కేంద్రమంత్రితో సీఎం రేవంత్ వీసీ

హైదరాబాద్, మే 27 (ఈవార్తలు): రాష్ట్రంలోని ప్రతీ గ్రామంలోని ప్రతీ ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ అందించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రాం కింద.. తెలంగాణలో టీ-ఫైబర్ ప్రాజెక్టును అమలు చేయడంపై.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా తరువాయి 2 వ పేజీలో...




2

## రూ.200కే జియో ఓటీటీ పాస్

15 ప్రీమియం ఓటీటీ యాప్స్, 1000 లైవ్ టీవీ చానెళ్ల యాక్సెస్

28 రోజుల వ్యాలిడిటీతో 30 జీబీ హైస్పీడ్ డేటా, అన్‌లిమిటెడ్ 5జీ

యూట్యూబ్ ప్రీమియం, హాట్‌స్టార్, ప్రైమ్ వీడియో సేవలు కూడా

## తప్పు దేవుడిది కాదు!

**‘యాక్ట్ ఆఫ్ గాడ్’పై తగ్గిన ఎన్‌హెచ్ఏఐ.. రూ.1.80 కోట్ల పరిహారానికి పచ్చజెండా**

సిమ్లాలో గతేడాది కొండచరియలు విరిగిపడిన ఘటనలో బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించేందుకు ‘జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ’ ముందుకొచ్చింది. ఆ ఘటనను ‘దేవుడి చర్య’గా పేర్కొంటూ.. పరిహారం చెల్లించాల్సిన బాధ్యత తమకు లేదని ఇటీవల వాదించినప్పటికీ.. తాజాగా వెనక్కి తగ్గింది. బాధిత కుటుంబానికి రూ.1.80 కోట్ల మేర పరిహారం చెల్లించేందుకు ముందుకొచ్చినట్లు అధికారులు తెలిపారు.



సిమ్లా: సిమ్లాలోని ధల్లీ ప్రాంతంలో గతేడాది మే నెలలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో నరీందర్ సింగ్ రాథోడ్ అనే వ్యక్తికి చెందిన పండ్ల తోట తీవ్రంగా దెబ్బతింది. ఎన్‌హెచ్ఏఐ, దాని గుత్తేదారు కొండవాలును సరిగా బలోపేతం చేయకుండానే భారీ నిర్మాణ పనులు చేపట్టడం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని ఆరోపిస్తూ ఆయన ‘జాతీయ హరిత ట్రైబ్యునల్’ను ఆశ్రయించారు. కొండచరియలు విరిగిపడటం ‘దేవుడి చర్య’ అని.. తరువాయి 2 వ పేజీలో...



## పోక్సో కేసులో సీన్ రీకన్‌స్ట్రక్షన్

### అరణ్య ఫామ్‌హౌస్‌కు బండి భగీరథ్

హైదరాబాద్, మే 27 (ఈవార్తలు): పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసులు కస్టడీకి తీసుకుని మొయినాబాద్ మండలంలోని అరణ్య ఫామ్‌హౌస్‌కు తీసుకువెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఇప్పటికే పోలీసులు బండి భగీరథ్ నలుగురు స్నేహితులను ప్రశ్నించారు. బాధితురాలు, ఆమె తల్లి స్టేట్‌మెంట్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. అరణ్య ఫామ్‌హౌస్‌లో తన కుమార్తెపై అఘాయిత్యం జరిగిందని బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమార్తెను ఒత్తిడి చేసి తరువాయి 2 వ పేజీలో...



## భారత సంతతి వైద్యుడిపై వేటు

### రోగితో లైంగిక సంబంధం ఘటనలో తీర్పు

యూకేలో భారత సంతతికి చెందిన ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ చిరాగ్ పటేల్‌పై అక్కడి మెడికల్ ప్రాక్టీషనర్స్ ట్రైబ్యునల్ సర్వీస్ 8 నెలల సస్పెన్షన్ విధించింది. మహిళా రోగితో లైంగిక సంబంధం పెట్టుకోవడం, నిబంధనలకు విరుద్ధంగా ఆమెకు మత్తు మందులు సూచించడం వంటి తీవ్రమైన ఆరోపణలు రుజువు కావడంతో ఈ నిర్ణయం తీసుకుంది.

లండన్: వివరాల్లోకి వెళితే, కార్డిఫ్‌లోని యూనివర్సిటీ హాస్పిటల్ ఆఫ్ వేల్స్‌లో డాక్టర్ చిరాగ్ పటేల్ న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్నారు. 2019లో వెన్నెముక సమస్యతో తరువాయి 2 వ పేజీలో...

## ఆశారాంకు జీవిత ఖైదు

వెంటనే లొంగిపోవాలని రాజస్థాన్ హైకోర్టు ఆదేశం



2



# రాశి ఫలాలు

28.5.2026

మేషం: వృత్తి ఉద్యోగాలలో ఒక సంఘటన ఆశ్చర్యం కలిగిస్తుంది. సంతానానికి విద్యా, ఉద్యోగావకాశాలు లభిస్తాయి. నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. సోదరుల నుండి శుభవార్తలు అందుకుంటారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. వ్యాపారాలు, సాఫీగా సాగుతాయి.

వృషభం: ఆర్థిక ఇబ్బందులు కొంత ఇబ్బంది కలిగిస్తాయి. నూతన ఋణయత్నాలు చేయవలసి వస్తుంది. దూర ప్రయాణాలలో అవాంతరాలు కలుగుతాయి. దైవ కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. గృహ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. ఉద్యోగమున అదనపు పనిభారం ఉంటుంది.

మిధునం: ముఖ్యమైన వ్యవహారాలలో వ్యయప్రయాసలు తప్పవు. మిత్రులతో కలహా సూచనలు ఉన్నవి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరిగి సమయానికి నిద్రాహారాలు ఉండవు. ఇంటా బయట పరిస్థితులు అనుకూలించవు. దూర ప్రయాణాలు వాయిదా వేయటం మంచిది. వ్యాపారాలు నిరాశ పరుస్తాయి.

కర్కాటకం: ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుకుంటారు. దీర్ఘకాలిక వివాదాలు పరిష్కారమవుతాయి. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. చాలాకాలంగా పడుతున్న శ్రమ ఫలిస్తుంది. నూతన వ్యక్తుల పరిచయాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు కొంత సామాన్యంగా సాగుతాయి.

సింహం: బంధుమిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి.ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. ఉద్యోగమున సహోద్యోగులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. నిరుద్యోగులు శ్రమ ఫలించదు.

కన్య: ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక ఋణదాతల ఒత్తిడులు తొలగుతాయి. ఉద్యోగాలు సజావుగా సాగుతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించి లాభాలు అందుకుంటారు.

తుల: అనుకోని ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. కుటుంబ సభ్యులతో స్వల్ప విభేదాలు కలుగుతాయి. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణయత్నాలు చేస్తారు. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపార, ఉద్యోగములు నిరుత్సాహ పరుస్తాయి.

వృశ్చికం: కుటుంబ వాతావరణం ఉత్సాహంగా ఉంటుంది. మిత్రులతో ఆలయ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపారాలలో విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. ఆప్తుల నుంచి కీలక సమాచారం సేకరిస్తారు. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

ధనస్సు: ఆర్థికంగా పురోగతి కలుగుతుంది. గృహమున కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. నిరుద్యోగ యత్నాలు ఫలిస్తాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. సన్నిహితుల నుండి ధన సాయం అందుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో స్థానచలన సూచనలు ఉన్నవి.

మకరం: కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు శిరో బాధను కలిగిస్తాయి. వ్యాపారాలు కొంత మందగిస్తాయి. చేపట్టిన పనుల్లో ప్రతిష్ఠంభనలు కలుగుతాయి. ఆకస్మిక ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. ఉద్యోగాలలో సమస్యల పరిష్కారానికి అధికారులు సహాయ సహకారాలు అందుతాయి.

కుంభం: చేపట్టిన పనులు ముందుకు సాగవు. స్వల్ప అనారోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. ముఖ్యమైన పనులలో శ్రమపడ్డా ఫలితం కనిపించదు. భూ సంబంధిత క్రయవిక్రయాలలో ఒప్పందాలు వాయిదా పడతాయి. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగాలలో ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు.

మీనం: గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. గృహమున ఆత్మీయులతో ఆనందంగా గడుపుతారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు మరింత పుంజుకుంటాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి.

# శాంసంగ్ ఉద్యోగులకు మేత

**ఒక్కొక్కరికి రూ.3.25 కోట్ల బోనస్.. 78 వేల మందికి ఇవ్వనున్నట్లు ప్రకటన**

న్యూఢిల్లీ: ప్రముఖ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ తమ ఉద్యోగులకు భారీ కానుక ప్రకటించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో నెలకొన్న అనూహ్యమైన వృద్ధి కారణంగా కంపెనీ చిప్ విభాగం లాభాల పంట పండించడంతో ఆ ఫలాలను ఉద్యోగులతో పంచుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా చిప్ డివిజన్‌లోని ప్రతి ఉద్యోగికి సగటున 3,40,000 డాలర్లు (దాదాపు రూ. 3.25 కోట్లు) బోనస్‌గా అందనుంది. ఈ మేరకు కంపెనీ యాజమాన్యానికి, కార్మిక సంఘానికి మధ్య కుదిరిన ఒప్పందానికి ఉద్యోగుల నుంచి ఆమోదం లభించింది. తాజాగా జరిగిన ఓటింగ్‌లో కంపెనీ అతిపెద్ద కార్మిక సంఘం ఈ భారీ బోనస్ ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. ఈ ఓటింగ్‌లో 95 శాతానికి పైగా అర్హులైన సభ్యులు పాల్గొనగా, వారిలో 73.7 శాతం మంది ఒప్పందానికి అనుకూలంగా ఓటు వేశారు. ఈ ఒప్పందంతో దాదాపు 18 రోజుల పాటు జరగాల్సిన సమ్మె ముప్పు తప్పింది. ఈ సమ్మె జరిగి ఉంటే శాంసంగ్ ఉత్పత్తికే కాకుండా ప్రపంచ సరఫరా వ్యవస్థకు కూడా తీవ్ర అంతరాయం కలిగి ఉండేది. ప్రస్తుతం ఏఐ డేటా సెంటర్ల కోసం మెమరీ చిప్‌లకు విపరీతమైన డిమాండ్ నెలకొంది. ప్రపంచంలోనే అతిపెద్ద మెమరీ చిప్ తయారీదారుల్లో ఒకటైన శాంసంగ్ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంది. దీంతో గడిచిన త్రైమాసికంలో కంపెనీ చిప్ విభాగం ఆదాయం ఏకంగా 49 రెట్లు పెరిగింది. ఈ నేపథ్యంలోనే ఉద్యోగులకు లాభాల్లో వాటా ఇవ్వాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. ఈ బోనస్ శాంసంగ్ ఉద్యోగులందరికీ కాకుండా కేవలం ప్రాసెసర్లు, మెమరీ చిప్‌లను తయారు చేసే చిప్ విభాగానికే వర్తిస్తుంది. ఈ డివిజన్‌లో సుమారు 78,000 మంది ఉద్యోగులు ఉన్నారు. ఒప్పందం ప్రకారం సెమీకండక్టర్ విభాగం ఆపరేటింగ్ ప్రాఫిట్‌లో 10.5 శాతాన్ని ఉద్యోగులకు షేర్ల రూపంలో, మరో 1.5 శాతాన్ని నగదు రూపంలో చెల్లిస్తారు. ఈ బోనస్ చెల్లింపుల కోసం కంపెనీ సుమారు 26.5 బిలియన్ డాలర్లు ఖర్చు చేయనుందని అంచనా. ఇటీవలే తైవాన్‌కు చెందిన టీఎస్ఎంసీ తర్వాత ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువను దాటిన రెండో ఆసియా కంపెనీగా శాంసంగ్ నిలిచింది.

# ఎయిరిండియా సర్వీసుల కోత

**ఇంధన ధరల భారంతో నిర్ణయం.. జూలై, ఆగస్టు నెలల కోటా కుదింపు**

న్యూఢిల్లీ: జులై, ఆగస్టు నెలల్లో ఎయిరిండియా విమానాల్లో ప్రయాణించాలనుకునే వారికి కొన్ని రూట్లలో ఆప్షన్లు తగ్గనున్నాయి. ఇప్పటికే అంతర్జాతీయ సర్వీసులను కుదించిన విషయం తెలిసిందే. ఇప్పుడు దేశీయ విమాన సర్వీసులను కూడా తగ్గించాలని సంస్థ నిర్ణయించింది. విమాన ఇంధన ధరలు భారీగా పెరగడమే ఇందుకు కారణమని విమానయాన వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ముఖ్యంగా ఇరాన్ సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా విమాన ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. దీంతో ఎయిరిండియా జులై, ఆగస్టు నెలల్లో తన దేశీయ విమాన సర్వీసులను 15 నుంచి 20 శాతం వరకు తగ్గించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే ఏ రూట్లను పూరిగా రద్దు చేయకుండా కేవలం విమానాల ఫ్రీక్వెన్సీని మాత్రమే తగ్గించాలని సంస్థ భావిస్తోంది. ఈ మార్పులపై ఎయిరిండియా అధికారిక ప్రతినిధి స్పందించారు. ఇంధన ధరల ప్రభావం వల్లే కొన్ని దేశీయ రూట్లలో సర్వీసులను తాత్కాలికంగా క్రమబద్ధీకరి స్తున్నట్లు స్పష్టం చేశారు. పరిస్థితులు చక్కబడిన తర్వాత మళ్లీ పాత షెడ్యూల్ ప్రకారం అన్ని విమానాలను పునరుద్ధరిస్తామని చెప్పారు. ప్రయాణికుల డిమాండ్, మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తామని ఎయిరిండియా వెల్లడించింది. షెడ్యూల్ మార్పుల వల్ల ఇబ్బంది పడే ప్రయాణికులకు పూర్తి సాయం అందిస్తామని విమానయాన సంస్థ హామీ ఇచ్చింది. టికెట్లు బుక్ చేసుకున్న వారికి ప్రత్యామ్నాయ విమానాల్లో సీట్లు కేటాయించడం, ఎలాంటి అదనపు రుసుము లేకుండా ప్రయాణ తేదీలను మార్చుకునే అవకాశం కల్పించడం లేదా పూర్తి డబ్బును రిఫండ్ చేయడం వంటి ఆప్షన్లను అందిస్తామని తెలిపింది. రాబోయే రెండు నెలల్లో ప్రయాణించే వారు ముందే ఫ్లైట్ షెడ్యూల్స్ తనిఖీ చేసుకోవడం మంచిది.

# డిజి పల్లెలు

మొదటి పేజీ తరువాయి

చర్చించారు. తొలిదశలో తెలంగాణలోని పలు జిల్లాల్లోని 3,089 గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పలు కీలక అంశాలను కేంద్రమంత్రి జ్యోతిరాధిత్య సింధియా దృష్టికి సీఎం రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి, ప్రతీ ఇంటికి బలమైన హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చించారు. అదే సమయంలో అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రాం అమలుకు సంబంధిత ఒప్పందాన్ని వెంటనే కుదుర్చుకోవడం.. పెండింగ్‌లో ఉన్న నిధులను వేగంగా విడుదల చేయడం వంటి అంశాలపై కీలక చర్చలు జరిపారు. ప్రతీ మండలం నుంచి ప్రతీ గ్రామ పంచాయతీ రింగ్ నెట్‌వర్క్ ఆస్తులను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేసేందుకు స్పష్టమైన విధానం ఏర్పాటు చేయడంపై జ్యోతిరాధిత్య సింధియాతో రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. ఈ ప్రతిపాదనపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. తెలంగాణకు కేంద్రం అన్నివిధాలుగా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలకు నిరంతరం హై స్పీడ్ బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీని అందించే లక్ష్యంగా అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ సజావుగా అమలు చేయడంపై కేంద్రమంత్రి దృష్టికి కొన్ని కీలక అంశాలను సీఎం రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు.

అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రామ్ కింద తెలంగాణలో టీ ఫైబర్ ప్రాజెక్టు అమలుపై ముఖ్యమంత్రి కేంద్రమంత్రితో చర్చించారు. తెలంగాణ ఆశిస్తున్న లక్ష్యాన్ని సాధించడానికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రామ్‌లో భాగంగా తెలంగాణ ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్ ఏర్పాటు చేసి దాని ద్వారా కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడం.. తద్వారా రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా విస్తృతమైన హై స్పీడ్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి పరుచుకోవడానికి వీలుంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏకీకృత డిజిటల్ విధానం వల్ల టీ ఫైబర్ నెట్‌వర్క్‌ను విస్తరిస్తూ ప్రతి గ్రామ పంచాయతీని అనుసంధానిస్తూ రింగ్ ఆర్కిటెక్చర్‌గా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి సంకల్పించారు. రింగ్ ఆర్కిటెక్చర్ ద్వారా ఒక మార్గంలో నెట్‌వర్క్ అంతరాయం ఏర్పడినా.. ప్రత్యామ్నాయ మార్గం ద్వారా నిరంతరం సేవలు కొనసాగేలా చర్యలు తీసుకోనున్నారు. దీనివల్ల గ్రామీణ తెలంగాణకు అంతరాయం లేకుండా హై స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి దశలో.. నెట్‌వర్క్ దెబ్బతిన్న ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లోని 3089 గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీని పునరుద్ధరించనున్నారు. అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ కింద గ్రామాలను అనుసంధానిస్తూనే.. భవిష్యత్తు అవసరాలకు సరిపడే ఫైబర్ నెట్ వర్క్ మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రాష్ట్రంలోని హై స్పీడ్ నెట్‌వర్క్ అందుతున్న ఇతర ప్రాంతాలకు సమంగా సేవలు అందించవచ్చని పేర్కొన్నారు.

# సర్.. మీరు కరెక్టే!

మొదటి పేజీ తరువాయి

ఆర్టికల్ 326తో పాటు 1950 ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఈ తరహా ప్రత్యేక సవరణలు చేపట్టే అధికారం ఎన్నికల సంఘానికి ఉందని కోర్టు స్పష్టం చేసింది. ఈ ప్రత్యేక సవరణ ద్వారా ఓటరు జాబితా పారదర్శకతను పెంచొచ్చని, ఇది రాజ్యాంగం నిర్దేశించిన ఉచిత, పక్షపాతరహిత ఎన్నికల లక్ష్యానికి లోబడే ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రస్తుతం ఉన్న ఎన్నికల చట్టాలను ఎక్కడా అతిక్రమించడం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21(3) పరిధిలోనే ఎన్నికల సంఘం తన విధులను నిర్వర్తించిందని, అందువల్ల అధికారులు తమ పరిధి దాటి ప్రవర్తించారని చెప్పలేమని కోర్టు తేల్చిచెప్పింది. తొలుత బిహార్‌లో ప్రారంభమైన ఈ విధానాన్ని ఆ తర్వాత ఎన్నికల సంఘం ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరింపజేసింది. కొన్ని నెలలుగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ఎన్నికల సంఘానికి, ప్రతిపక్ష పార్టీలకు మధ్య తీవ్ర స్థాయిలో వివాదం నడుస్తోంది. ఈ సవరణల వల్ల అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోతున్నాయని విపక్షాలు ఆరోపిస్తూ వచ్చాయి. అయితే తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఈ వివాదానికి తెరపడినట్లయింది. మే 30 నుంచి 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో చివరి విడత ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియ యథావిధిగా సాగనుంది.

## సర్ వల్లే మమత, స్టాలిన్ ఓటమి: జగన్

మొదటి పేజీ తరువాయి

కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఓట్ల తొలగింపుపై అనేక రాజకీయ పార్టీలు అనుమానాలు వ్యక్తం చేశాయని జగన్ గుర్తుచేశారు. పశ్చిమ బెంగాల్‌లో 91 లక్షల ఓట్లు, తమిళనాడులో 94 లక్షల ఓట్లు తొలగించారని ఆయన గణాంకాలతో సహా వివరించారు. పశ్చిమ బెంగాల్‌లోని భబానీపూర్ నియోజకవర్గంలో 45,982 ఓట్లను తొలగించారని, అక్కడ మమతా బెనర్జీ 15,000 ఓట్ల తేడాతో ఓడిపోయారని తెలిపారు. అదేవిధంగా, తమిళనాడులోని కొళత్తూరు నియోజకవర్గంలో 71,000 ఓట్లను తొలగించగా, స్టాలిన్ 8,000 ఓట్లతో ఓటమి చవిచూశారని జగన్ విశ్లేషించారు. ప్రతి గ్రామంలో కొద్ది సంఖ్యలో నిజమైన ఓట్లను తొలగించినా, అది నియోజకవర్గ స్థాయి ఫలితాలను గణనీయంగా ప్రభావితం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీకి సంబంధించిన దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్లపై నిశితంగా దృష్టి సారించాలని పార్టీ శ్రేణులకు జగన్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గాన్ని ఉదాహరణగా చూపుతూ, అక్కడ ఓటర్ల జాబితాలో ఒకే పేరు, ఒకే కుటుంబ వివరాలతో వేలాది అనుమానాస్పద ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు.

## పోక్సో కేసులో సీన్ రీకన్‌స్ట్రక్షన్

మొదటి పేజీ తరువాయి

మద్యం తాగించి, అనంతరం అనుచితంగా ప్రవర్తించినట్టు ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు బండి భగీరథ్‌ను కస్టడీకి తీసుకువెళ్లి, సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఈ నెల 16వ తేదీన అరెస్టైన బండి భగీరథ్ ప్రస్తుతం చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. మల్కాజ్‌గిరి కోర్టు మూడు రోజుల కస్టడీకి అనుమతించిన నేపథ్యంలో పోలీసులు బుధవారం ఉదయం చర్లపల్లి కేంద్ర కారాగారానికి చేరుకుని, అతడిని కస్టడీకి తీసుకున్నారు.

## తప్పు దేవుడిది కాదు!

మొదటి పేజీ తరువాయి

అందువల్ల పరిహారం చెల్లించాల్సిన బాధ్యత తమకు లేదని ఎన్జీటీలో ఎన్‌హెచ్ఏఐ ఇటీవల అఫిడవిట్ దాఖలు చేసింది. అయితే.. ప్రజా పనులు, ఉద్యానవన శాఖల అంచనాల అనంతరం ఎన్‌హెచ్ఏఐ తన వైఖరిని మార్చుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బాధిత కుటుంబానికి రూ.1.80 కోట్లమేర పరిహార ప్యాకేజీని చెల్లించడానికి అంగీకరించిందని చెప్పారు. ఇందులో భాగంగా.. కొండచరియలు విరిగి పడటం వల్ల తీవ్రంగా దెబ్బతిన్న రాథోడ్ వ్యవసాయ భూమిని కొనుగోలు చేయడంతోపాటు దాదాపు 440 ఆపిల్ చెట్లకు వాటిల్లిన నష్టానికి గాను పరిహారం కూడా చెల్లించనుందన్నారు.

## భారత సంతతి వైద్యుడిపై వేటు

మొదటి పేజీ తరువాయి

బాధపడుతున్న ఒక మహిళకు ఆయన శస్త్రచికిత్స చేశారు. ఆ తర్వాత కొద్దికాలానికే వారి మధ్య వ్యక్తిగత సంబంధం మొదలైంది. దాదాపు ఆరు నెలల పాటు ఈ సంబంధం కొనసాగింది. ఈ క్రమంలో ఆయన ఆమెకు అశ్లీల చిత్రాలు పంపినట్లు కూడా విచారణలో తేలింది. వారిద్దరి మధ్య సంబంధం దెబ్బతిన్న తర్వాత, 2022 మే నుంచి 2023 జనవరి మధ్య కాలంలో, డాక్టర్ పటేల్ ఆమెకు మార్ఫిన్ సల్ఫేట్, డయాజెపామ్ వంటి తీవ్రమైన మత్తు కలిగించే మందులను ఎలాంటి వైద్యపరమైన రికార్డులు లేకుండా, ఆమె జనరల్ ఫిజీషియన్‌కు సమాచారం ఇవ్వకుండా సూచించారు. ట్రైబ్యునల్ విచారణలో డాక్టర్ పటేల్ తన వాదన వినిపిస్తూ, ఆ సమయంలో తాను కుటుంబ సమస్యలతో బాధపడుతున్నానని తెలిపారు. సంబంధాన్ని ముగించాలని ప్రయత్నించినప్పుడు, ఆ మహిళ తనను బ్లాక్‌మెయిల్ చేసిందని, ఈ విషయం బయటపెడతానని బెదిరించిందని ఆరోపించారు. తన ఉద్యోగం, కీర్తి దెబ్బతింటాయనే భయంతోనే ఆమెతో పరిచయం కొనసాగించానని, మందులు సూచించానని చెబుతూ పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. అయితే, డాక్టర్ పటేల్ వాదనను ట్రైబ్యునల్ తోసిపుచ్చింది. రోగి భద్రతను గాలికొదిలి, తన వృత్తిని, కుటుంబాన్ని కాపాడుకోవడానికే ఆయన ప్రాధాన్యత ఇచ్చారని అభిప్రాయపడింది.

# రూ.200కే జియో ఓటీటీ పాస్

**15 ప్రీమియం ఓటీటీ యాప్స్,**
**1000 లైవ్ టీవీ చానెళ్ల యాక్సెస్**

ముంబై: రిలయన్స్ జియో వినియోగదారుల కోసం సరికొత్త ఆఫర్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. కేవలం రూ.200 ధరతో "జియో ఓటీటీ పాస్" పేరుతో ఒకే ప్యాక్‌లో అనేక ప్రయోజనాల ను అందిస్తోంది. ఈ ప్యాక్‌తో వినియోగదారులు 15 ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, 1000కి పైగా లైవ్ టీవీ ఛానెళ్లు, 30 జీబీ హైస్పీడ్ డేటాను పొందవచ్చు. ఇవాళ్టి నుంచి ఈ కొత్త పాస్ అన్ని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఛానెళ్లలో అందుబాటులోకి వచ్చింది. ఈ ఓటీటీ పాస్ ద్వారా సుమారు రూ.1,500 విలువైన ప్రయోజనాలను కేవలం రూ.200కే అందిస్తున్నట్టు జియో ప్రకటించింది. ఈ ప్యాక్‌లో యూట్యూబ్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ లభిస్తుంది. దీని ద్వారా యాడ్స్ లేకుండా వీడియోలు చూడటంతో పాటు, ఆఫ్‌లైన్ డౌన్‌లోడ్, బ్యాక్‌గ్రౌండ్ ప్లే వంటి ఫీచర్లు వాడుకోవచ్చు. దీంతో పాటు, జియోహాట్‌స్టార్ మొబైల్ ప్లస్ హాలీవుడ్, ప్రైమ్ వీడియో మొబైల్ ఎడిషన్ కూడా ఈ ప్యాక్‌లో భాగంగా ఉన్నాయి. వీటితో పాటు సోనీలివ్, జీ5, లయన్స్‌గేట్ ప్లే, డిస్కవరీం, సన్ నెక్ట్స్, ఫ్యాన్‌కోడ్, ప్లానెట్ మరాఠీ, చౌపాల్, హోయ్‌చోయ్ సహా మొత్తం 12 ఇతర ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల సేవలను జియోటీవీ ద్వారా పొందవచ్చు. కేవలం ఓటీటీలే కాకుండా, జియోటీవీ యాప్‌లో 1000కి పైగా లైవ్ టీవీ ఛానెళ్లను చూసే అవకాశం ఉంది. వీటిలో స్టార్ ప్లస్ హెచ్‌డీ, కలర్స్ హెచ్‌డీ, సన్ టీవీ హెచ్‌డీ, డిస్కవరీ, యానిమల్ ప్లానెట్ వంటి 150కి పైగా పెయిడ్ ఛానెళ్లు కూడా ఉన్నాయి. కనెక్టివిటీ విషయానికొస్తే, ఈ ప్యాక్‌లో 30 జీబీ హైస్పీడ్ 4జీ/5జీ డేటాతో పాటు, అపరిమిత 5జీ సేవలు లభిస్తాయి. ఈ పాస్ వ్యాలిడిటీ 28 రోజులు. ఇప్పటికే యాక్టివ్ బేస్ ప్లాన్ ఉన్న ఏ జియో వినియోగదారుడైనా ఈ పాస్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు. మైజియో యాప్, జియో.కామ్ వెబ్‌సైట్, రిటైల్ స్టోర్లు, ఇతర థర్డ్-పార్టీ రీఛార్జ్ యాప్స్‌లో ఈ కొత్త ఓటీటీ పాస్ అందుబాటులో ఉంది.

# కెనడాలో 17 మంది ప్రవాసుల అరెస్టు

మొదటి పేజీ తరువాయి

పరిధిలోని స్థానిక వ్యాపార సంస్థలను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులు, పరస్పర దాడులు, తీవ్ర హింసాత్మక ఘటనలు పెరుగుతుండటంతో పీల్ రీజినల్ పోలీసులు ప్రత్యేకంగా 'ఎక్స్‌టార్షన్ టాస్క్ ఫోర్స్'ను రంగంలోకి దించారు. ఈ ప్రత్యేక దళం అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించి, స్థానిక వ్యాపారులను లొంగదీసుకునేందుకు సాగుతున్న ఒక సమన్వయ పూర్వక క్రిమినల్ నెట్‌వర్క్‌ను విజయవంతంగా ఛేదించిందని పీల్ రీజినల్ పోలీసులు సోమవారం రాత్రి తమ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేసిన ఒ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

# బైజూస్ రవీంద్రన్‌కు ఆర్నెల్ల జైలు

మొదటి పేజీ తరువాయి

అథారిటీకి చెందిన ఓ అనుబంధ సంస్థ భారీగా పెట్టుబడులు పెట్టింది. ఆ తర్వాత జరిగిన ఒప్పంద ఉల్లంఘనల కారణంగా ఖతార్ సంస్థ సింగపూర్ కోర్టులో న్యాయపోరాటానికి దిగింది. తమ నిధులను రికవరీ చేసుకునే క్రమంలో భాగంగా ఈ కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను దాఖలు చేసింది. కేసు విచారణలో భాగంగా బైజూ రవీంద్రన్ తన వ్యక్తిగత ఆస్తులు, కంపెనీ వాటాల వివరాలను కోర్టుకు సమర్పించాల్సి ఉంది. ముఖ్యంగా 'బీఆర్ ఇన్వెస్ట్‌కో' అనే అనుబంధ సంస్థకు సంబంధించిన యాజమాన్య పత్రాలను చూపించాలని న్యాయస్థానం ఆదేశించింది. అయితే గత కొంతకాలంగా కోర్టు ఇచ్చిన వరుస ఆదేశాలను ఆయన బేఖాతరు చేస్తూ వచ్చారు. ఆస్తుల వివరాలను వెల్లడించకుండా దాటవేయడంతో ఆగ్రహించిన సింగపూర్ కోర్టు ఆయన్ను లొంగిపోవాలని ఆదేశించింది. జైలు శిక్షతో పాటు కోర్టు ఖర్చుల నిమిత్తం సుమారు 70,500 డాలర్ల జరిమానా కూడా రవీంద్రన్ చెల్లించాల్సి ఉంది. బైజూస్ పతనం తర్వాత ఆయనపై కేవలం సింగపూర్‌లోనే కాకుండా అమెరికాలోనూ పెద్ద ఎత్తున కేసులు నడుస్తున్నాయి. అమెరికా రుణదాతల నుంచి తీసుకున్న 1.2 బిలియన్ డాలర్ల లోన్ రికవరీ కేసు కూడా ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. రవీంద్రన్ ప్రస్తుతం ఎక్కడున్నారనేది స్పష్టత లేదు.

# ఆశారాంకు జీవిత ఖైదు

**వెంటనే లొంగిపోవాలని రాజస్థాన్ హైకోర్టు ఆదేశం**

జైపూర్: స్వయం ప్రకటిత ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపూకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. మైనర్ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో కింది కోర్టు విధించిన జీవిత ఖైదును రాజస్థాన్ హైకోర్టు సమర్థించింది. ఆయన దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ బుధవారం సంచలన తీర్పు వెలువరించింది. ప్రస్తుతం మధ్యంతర వైద్య బెయిల్‌పై బయట ఉన్న 86 ఏళ్ల ఆశారాం వెంటనే అధికారుల ఎదుట లొంగిపోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, ఇదే కేసులో సహ నిందితులుగా ఉన్న శిల్పి, శరత్‌చంద్‌లను నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు విముక్తి కల్పించింది. జస్టిస్ అరుణ్ మోంగా, జస్టిస్ యోగేంద్ర కుమార్ పురోహిత్‌లతో కూడిన హైకోర్టు ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. 2013 ఆగస్టులో జోధ్‌పూర్‌లోని తన ఆశ్రమంలో మైనర్ బాలికపై ఆశారాం లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. సుదీర్ఘ విచారణ అనంతరం జోధ్‌పూర్‌లోని ప్రత్యేక పోక్సో కోర్టు 2018 ఏప్రిల్ 25న ఆశారాంను దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆశారాం హైకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై 2026 ఫిబ్రవరి 16 నుంచి ఏప్రిల్ 20 వరకు హైకోర్టు రోజువారీ విచారణ జరిపి, తీర్పును రిజర్వ్ చేసింది. బుధవారం తుది తీర్పును వెల్లడించింది. ఆశారాం ఇప్పటికే గుజరాత్‌లోని గాంధీనగర్ ఆశ్రమంలో మరో మహిళపై అత్యాచారం కేసులో దోషిగా తేలి జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. ఆ కేసులో 2023 జనవరిలో ఆయనకు శిక్ష పడింది. వృద్ధాప్యం, అనారోగ్య కారణాలతో పలుమార్లు బెయిల్ కోసం ప్రయత్నించిన ఆయనకు, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హైకోర్టు మధ్యంతర వైద్య బెయిల్ మంజూరు చేసింది. తాజా తీర్పుతో ఆయన మళ్లీ జైలుకు వెళ్లడం ఖాయమైంది.

# దోశ.. పూరీ.. మిల్లెట్ ఇడ్లీ

## ఇంటర్ విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ మెనూ రెడీ.. జూన్ 12 నుంచి పథకం అమలు

హైదరాబాద్, మే 27 (ఈవార్తలు): రాష్ట్రంలో ఇంటర్ విద్యార్థుల కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026-2027 విద్యా సంవత్సరం నుంచి బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అమలు చేయనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే జూన్ 12వ తేదీ నుంచి ఈ పథకం మొదలు కానుండగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. వయస్సుకు తగిన పోషకాలు అందేలా ఈ బ్రేక్ ఫాస్ట్ స్కీంలో మెనూను అధికారులు రెడీ చేశారు. మధ్యాహ్న భోజనం, బ్రేక్ ఫాస్ట్ స్కీంకు కలిపి ప్రతీ సంవత్సరం రూ.180 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయనుంది. ఈ బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద రాష్ట్రంలోని 1.92 లక్షల మంది ఇంటర్ విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. ఇక రోజుకో వెరైటీ చొప్పున వారానికి సరిపడా మెనూను రెడీ చేశారు. ఒక రోజు దోశ, పూరీ, మిల్లెట్ ఇడ్లీ, బోండా, ఉప్మా ఇలా రకరకాల వంటకాలను ఇంటర్ విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ స్కీంలో అందించనున్నారు. వీటికి చట్నీ, సాంబార్, మిక్స్‌డ్ వెజిటబుల్ కుర్మా వంటివి కూడా అందించి.. విద్యార్థులకు రుచికరమైన, పోషకాలతో కూడిన టిఫిన్ ఏర్పాటు చేయనున్నారు. కీలకమైన ఇంటర్మీడియట్ వయసులో ఉండే విద్యార్థులకు నాణ్యతతో కూడిన బలవర్ధక ఆహారాన్ని అందించాలని సీఎం రేవంత్ రెడ్డి.. సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ఇంటర్ విద్యార్థులకు ఈ బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నారు. ఇక ఇప్పటివరకు దేశవ్యాప్తంగా స్కూల్ విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం లేదు. కానీ తెలంగాణలో మాత్రం ఇంటర్ కాలేజీ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఇంటర్ విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందించే దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలవనుంది. ఇక ఇంటర్ చదివే విద్యార్థుల వయసు దాదాపు 15 ఏళ్ల నుంచి 18 ఏళ్ల మధ్య ఉంటుంది. కౌమార దశలో ఉన్న విద్యార్థినీ విద్యార్థులకు శారీరకంగా, మానసికంగా ఎదిగే దశ కావడంతో వారికి ఆ వయసులో పోషకాలతో కూడిన ఆహారం అవసరమని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలోనే జాతీయ పోషకాహార సంస్థ సిఫార్సుల ప్రకారం.. కౌమార దశలో ఉన్న వారికి రోజుకు 1029 కిలోకేలరీలు, 30-32 గ్రాముల ప్రోటీన్ అవసరం. ఈ సిఫార్సులకు అనుగుణంగానే తెలంగాణ సర్కార్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు తగినంత పోషకాలు అందించేలా ఈ బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకానికి రూపకల్పన చేసింది. ఇక జూన్ 12వ తేదీన ఇంటర్మీడియట్ కాలేజీ విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. అయితే తొలి రోజు 41,250 మంది విద్యార్థులు ఈ స్కీంలో భాగస్వాములు కానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మొదట 64 కాలేజీల్లో ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఆ తర్వాత పూర్తి స్థాయిలో రోజుకు 1.92 లక్షల మందికి భోజనం అందించనున్నారు. ఇంటర్మీయట్ విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌కు రూ.80 కోట్లు.. మధ్యాహ్న భోజనానికి రూ.100 కోట్లను ప్రతీ సంవత్సరం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

### బ్రేక్ ఫాస్ట్ మెనూ

- మొదటి రోజు - దోశ, చట్నీ
- రెండో రోజు - మిల్లెట్ ఇడ్లీ, సాంబార్
- మూడో రోజు - పూరీ, మిక్స్‌డ్ వెజిటెబుల్ కుర్మా
- నాలుగో రోజు - బోండా, చట్నీ
- ఐదో రోజు - ఇడ్లీ, చట్నీ
- ఆరో రోజు - ఉప్మా, చట్నీ లేదా సాంబార్
- రోజు విడిచి రోజు 150 మిల్లీలీటర్ల పాలు




## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


# 6 వేల ఉద్యోగాలు

**ఉద్యోగాల భర్తీకి టీఎస్‌పీఎస్సీ కసరత్తులు**

హైదరాబాద్, మే 27 (ఈవార్తలు): నిరుద్యోగులకు భారీ శుభవార్త చెప్పేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో ఉన్న ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు కసరత్తులు చేస్తోంది. అతి త్వరలోనే 6 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ కోసం ఎదురు చూసే నిరుద్యోగులకు త్వరలోనే శుభవార్త అందనుంది. ఈ ఉద్యోగాలకు సంబంధించి నోటిఫికేషన్లను రిలీజ్ చేసేందుకు టీజీపీఎస్సీ అధికారులు ముమ్మరంగా కసరత్తులు చేస్తున్నారు. రాష్ట్రంలో శాఖల వారీగీ వివరాలను సేకరించిన టీజీపీఎస్సీ త్వరలోనే సమావేశం ఏర్పాటు చేయనుంది. టీజీపీఎస్సీ కార్యదర్శికి ఇప్పటి వరకు అందిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలో 6 వేలకు పైగా ఖాళీలు ఉన్నట్లు సమాచారం. ఇక ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయోపరిమితిని ఇటీవలె రేవంత్ రెడ్డి సర్కార్ పెంచిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు 34 ఏళ్లుగా ఉన్న గరిష్ఠ వయోపరిమితిని 10 ఏళ్లు పెంచి.. 44 ఏళ్లుగా చేసింది. అయితే ఈ 6 వేలకుపైగా ఖాళీగా ఉన్న ఉద్యోగాల్లో అత్యధికంగా టీచింగ్ పోస్టులే ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో వెయ్యికిపైగా అధ్యాపక పోస్టులు ఉండగా.. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 300కి పైగా టీచర్ పోస్టులు ఉన్నట్లు సమాచారం. ఇక పాఠశాల విద్యాశాఖ పరిధిలోని జిల్లా ఉపాధ్యాయ శిక్షణా సంస్థలు (డైట్ కాలేజీల్లో) 100కి పైగా అధ్యాపక పోస్టులు.. జూనియర్ కాలేజీల్లో జూనియర్ లెక్చరర్ పోస్టులతో పాటు పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇవే కాకుండా దేవాదాయ శాఖ, అటవీ శాఖ, సర్వే సెటిల్‌మెంట్, ఆర్టీసీ, పురపాలక శాఖల్లో కూడా పలు పోస్టులు ఖాళీలు ఉన్నాయని టీజీపీఎస్సీ అధికారులు వెల్లడించారు. మరోవైపు.. తెలంగాణ ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పలు పోస్టులను భర్తీ చేసేందుకు.. ఇప్పటికే టీజీపీఎస్సీకీ ఆర్టీసీ ఎండీ లేఖ రాశారు. అదే సమయంలో పట్టణాభివృద్ధి, పురపాలక శాఖల్లో కూడా భారీ మొత్తంలో ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని.. త్వరలోనే వాటిని భర్తీ చేస్తామని సంబంధిత అధికారులు స్పష్టం చేశారు.

## మంచినీటికి వృథా.. 10 వేల ఫైన్

**హైదరాబాద్‌లో జలమండలి షాక్**

హైదరాబాద్, మే 27 (ఈవార్తలు): హైదరాబాద్‌లో మంచినీటిని వృథా చేసినందుకు జలమండలి ఒక వ్యక్తికి రూ.10 వేల జరిమానా విధించింది. తాగునీటిని ఇతర అవసరాలకు ఉపయోగించినందుకు గాను అధికారులు ఈ చర్య తీసుకున్నారు. బంజారాహిల్స్‌లోని రోడ్డు నెంబర్ 12లో ఆరెంజ్ ట్రీ ఫర్నీచర్ దుకాణం వద్ద ఈ ఘటన జరిగింది. తాగునీటితో ఒక వ్యక్తి దుకాణ ప్రాంగణాన్ని కడిగాడు. తనిఖీల సందర్భంగా జలమండలి అధికారులు దీనిని గుర్తించారు. స్వయంగా రంగంలోకి దిగిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మంచినీటిని వృథా చేస్తున్న వ్యక్తిని గుర్తించి అక్కడికక్కడే రూ.10 వేల జరిమానా విధించారు. ఈ క్రమంలో నగర ప్రజలకు జలమండలి అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తాగునీటిని కేవలం తాగడానికి, గృహ అవసరాలకు మాత్రమే వినియోగించాలని సూచించారు. రోడ్లు, ఇళ్ళు, వాహనాలు కడగడానికి ఉపయోగించకూడదని అన్నారు. నీటి వృథాను అరికట్టడంలో ప్రజలు భాగస్వాములు కావాలని అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు తప్పవని జలమండలి హెచ్చరించింది.

## శివయ్య ఒడిలో ప్రాణాలొదిలాడు!

**మృతదేహాన్ని అక్కడే వదిలేస్తాం**

**హైదరాబాద్ పర్వతారోహకుడి కుటుంబసభ్యులు**

హైదరాబాద్, మే 27 (ఈవార్తలు): శివుడి నివాసమైన హిమాలయ పర్వతాలలో అరుణ్ కుమార్ ప్రాణాలు వదిలారు కాబట్టి ఆయన మృతదేహాన్ని అక్కడే వదిలేయాలని నిర్ణయించుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గతవారం పర్వతారోహణ ముగించుకుని దిగివస్తుండగా హైదరాబాద్‌కు చెందిన పర్వతారోహకుడు అరుణ్ కుమార్ తివారీ ఎవరెస్టుపై మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడి బావమరిది సుధీర్ ఉపాధ్యాయ మాట్లాడుతూ, మృతదేహాన్ని పర్వతంపైనే వదిలి వేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని నగరానికి తీసుకువచ్చేందుకు చేపట్టే ప్రక్రియలు ముగిసేసరికి మృతదేహం చాలా వరకు దెబ్బతింటుందని, మంచులో నుంచి దానిని తీసే ప్రక్రియ కూడా చాలా ఖర్చుతో కూడుకున్నదని అన్నారు. దీనికి బదులు శివుడి నివాసంలోనే వదిలేయాలని కఠిన నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఎవరెస్ట్ యాత్రను నిర్వహించిన పయనీర్ అడ్వెంచర్స్ డైరెక్టర్ నివేశ్ కర్కి మాట్లాడుతూ, గత సంవత్సరం కూడా తివారి ఎవరెస్టును అధిరోహించడానికి ప్రయత్నించారని, కానీ ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో 7,200 మీటర్ల ఎత్తు నుంచి వెనక్కి వచ్చారని తెలిపారు. కానీ గతవారం ఎవరెస్టును విజయవంతంగా అధిరోహించి కిందకు దిగుతుండగా అస్వస్థతకు గురై శిఖరానికి కొంచెం దిగువన ఉన్న హిల్లరీ స్టెప్ సమీపంలో కన్నుమూసినట్లు తెలిపారు.

# లక్ష ఇండ్లకు ముగ్గు!

**పట్టణ ప్రాంతాల్లో తొలి విడత**

**ఆ దిశగా ప్రణాళికలు చేపట్టాం**

**మంత్రి పొంగులేటి వెల్లడి**

**హైదరాబాద్‌లో ప్రాంతాల పరిశీలన**



హైదరాబాద్, మే 27 (ఈవార్తలు): పేదల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతీస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ జిల్లా పరిధిలోని ఆసిఫ్ నగర్ మండలం జియాగూడలో పోలీస్ క్వార్టర్స్, మంగార్ బస్తి లోని వాంబే కాలనీ, నాంపల్లిలోని రెడ్ హిల్స్ లో గల ఖాళీ స్థలం, శిథిలావస్థలో ఉన్న పోలీస్ క్వాటర్స్, మలక్‌పేటలోని కాలడేరా లోని ఆర్ అండ్ బి కాలనీ అలాగే గోల్కొండ మండలం ఫలక్‌నామాలోని 2బీహెచ్‌కే డిగ్నిటీ కాలనీ ప్రాంతంలో గల ఖాళీ స్థలాన్ని హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజహరుద్దీన్, శాసనసభ్యులు మాజిద్ హుస్సేన్, అహమ్మద్ బిన్ అబ్దుల్లా బలాల ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి సందర్శించి పలు ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యంగా శిథిలావస్థలో ఉన్న భవనాలు అలాగే ప్రభుత్వ భూములను వేగవంతంగా మ్యాపింగ్ చేసి ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. శిథిలావస్థ భవనాల్లో నివాసముంటున్న కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాబోయే కొద్ది రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో తొలి విడత గృహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని, అలాగే వచ్చే ఒకటో తేదీన తొలి విడత ప్రారంభమవుతుందని అనంతరం రెండో విడత కూడా అమలు చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. తొలి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు మంజూరు చేయనున్నామని స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాల్లో కూడా తొలి విడతలో ఒక లక్ష ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అందుకు సంబంధించిన అన్ని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, అర్బన్ కోర్ ఏరియాల్లో లక్ష ఇళ్ల నిర్మాణాన్ని కవర్ చేసేలా ప్రాజెక్టు రూపకల్పన జరుగుతోందని అన్నారు. వచ్చే సంవత్సరం కూడా ఇదే విధంగా అర్హులైన పట్టణ పేదలకు, ఇళ్ల స్థలం లేని నిరుపేద కుటుంబాలకు గృహాలు అందించే కార్యక్రమాన్ని కొనసాగించాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. గత పదేళ్ల ప్రభుత్వ కాలంలో పేదలు జీవనోపాధి కోసం నివసించే ప్రాంతాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో పేదలు జీవనోపాధిని కోల్పోయారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యక్షంగా పరిస్థితులను పరిశీలించిన అనంతరం, భూమి విలువ ఎంత ఉన్నా అది ముఖ్యం కాదని, పేదవారి ఆత్మగౌరవమే ముఖ్యమని భావించి, కోర్ అర్బన్ ప్రాంతాల్లోనే ప్రభుత్వ భూములలో ఇళ్లు నిర్మించాలని నిర్ణయించిందని అన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే కొద్ది రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి శంకుస్థాపన కూడా నిర్వహించనున్నామని మంత్రి స్పష్టం చేశారు.

# వాక్ స్వాతంత్ర్యాన్ని వదులుకోం

**దానికోసం చావడానికైనా సిద్ధం**

**పవన్ అంశంలో ప్రొ. నాగేశ్వర్ స్పష్టీకరణ**

హైదరాబాద్, మే 27 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ మధ్య చెలరేగిన వ్యవహారం.. ఇప్పుడు రెండు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం రేపుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై హైదరాబాద్ పెట్టిన కేసులకు వ్యతిరేకంగా ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడిన ఆయన.. కీలక వ్యాఖ్యలు చేశారు. అరెస్ట్ చేస్తారో, కేసులు ఉపసంహరించుకుంటారో మీ ఇష్టం.. మేము మాత్రం మాట్లాడుతూనే ఉంటామని.. మాట్లాడే హక్కును వదులుకోం అంటూ తేల్చి చెప్పారు. కావాలంటే టైమ్, ప్లేస్ చెప్పండి తానే వస్తానని.. అరెస్ట్ చేసుకోండి అంటూ ఏపీ సర్కార్‌కు సవాల్ విసిరారు. తనపై లేనిపోని సెక్షన్లు అన్నీ కలిపి కేసులు నమోదు చేశారని వెల్లడించారు. తాను భయపడే వ్యక్తిని కాదని ప్రొఫెసర్ నాగేశ్వర్ స్పష్టం చేశారు. చట్టపరమైన చర్యలకు గానీ.. అరెస్ట్‌లకు గానీ తాను భయపడనని ప్రొఫెసర్ నాగేశ్వర్ తేల్చి చెప్పారు. తాను 30 ఏళ్ల వయసులోనే ఎన్నో సవాళ్లు, అడ్డంకులను ఎదుర్కొని భయపడని తాను.. ఇప్పుడు 62 ఏళ్ల వయసులో ఇలాంటి వాటికి భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తనపై లేనిపోని నిందలు మోపారని ఆయన తీవ్రంగా ఖండించారు. సమాజంలో కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్నానని కేసు పెట్టారని.. అల్లర్లు రేపేందుకు తాను ప్రయత్నం చేస్తున్నానని తప్పుడు కేసులు పెట్టారని పేర్కొన్నారు. తాను చిచ్చు పెడితే.. గత 10 రోజుల్లో ఏం అల్లర్లు జరిగాయని ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వమే తనపై స్వయంగా కేసులు పెట్టిందని తెలిపిన ప్రొఫెసర్ నాగేశ్వర్.. అసలు తాను చేసిన వ్యాఖ్యల్లో కుల ప్రస్తావన ఎక్కడ ఉందని నిలదీశారు. అసలు ప్రాంతాలు, కులాల ప్రస్తావన చేసింది ఆ రెండు పార్టీల వారేనని ఆరోపించారు. తాను తెలంగాణ వాడిని అని.. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల గురించి ఎందుకు అని ప్రశ్నిస్తున్నారని గుర్తు చేసిన ప్రొఫెసర్ నాగేశ్వర్.. తాను అమెరికా, ఇరాన్ గురించి కూడా మాట్లాడానని.. అంతమాత్రాన అక్కడి పౌరుడిని కావాలా అని ప్రశ్నించారు. అల్లర్లు సృష్టించేలా వ్యాఖ్యలు చేశానని తనపై మరో కేసు పెట్టారని.. అయితే రెండు దోమలు, నాలుగు ఈగలను కూడా ఎవరూ చంపలేదని ఎద్దేవా చేశారు. 4 కుక్కలు కూడా కొట్లాడుకోలేదని పేర్కొన్నారు. ఎన్ని కేసులు పెట్టినా, అరెస్ట్ చేయాలని చూసినా తాను భయపడేది లేదని.. ఏం చేసినా మాట్లాడే హక్కును మాత్రం వదులుకోనని ప్రొఫెసర్ నాగేశ్వర్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పేశారు. నిజాయితీగా ప్రజల పక్షాన తన గళాన్ని వినిపిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. తనను అరెస్ట్ చేస్తారా లేక కేసులు పెడతారా, వాటిని ఉపసంహరించుకుంటారా వాళ్ల ఇష్టమని పేర్కొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్.. తాను మాత్రం మాట్లాడుతూనే ఉంటానని తేల్చి చెప్పారు. కావాలంటే సమయం, ప్రాంతం చెప్పండి తానే వస్తానని.. కావాలంటే అరెస్ట్ చేసుకోండి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# తుమ్మిడిహెట్టిపై మాట్లాడుకుందాం

**మహారాష్ట్ర సీఎంకు రేవంత్ రెడ్డి లేఖ**

**బ్యారేజ్ ఎత్తుపై మరోసారి చర్చించాలని వినతి**

హైదరాబాద్, మే 27 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం ప్రాణహిత నదిపై నిర్మించాలని ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌కు సంబంధించి.. కీలక నిర్ణయం తీసుకున్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపు వ్యవహారంపై మహారాష్ట్ర సర్కార్‌తో చర్చలు జరపాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు సీఎం రేవంత్ రెడ్డి తాజాగా అధికారికంగా ఒక లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయం ఇవ్వాలని ఆ లేఖలో సీఎం రేవంత్ రెడ్డి.. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను కోరారు. అందుకు అనుకూలమైన తేదీని తొందరగా ఖరారు చేయాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత - చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మించాల్సి ఉంది. మొదటి ప్రతిపాదనలో భాగంగా ఈ తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌ను 152 మీటర్ల ఎత్తు నిర్మించాలని భావించారు. 2016 ఆగస్ట్ 23వ తేదీన జరిగిన ఇంటర్ స్టేట్ బోర్డు సమావేశంలో తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలిపింది. అవసరమైన అనుమతులకు సహకారం అందిస్తామని కూడా మహారాష్ట్ర సర్కార్ అప్పట్లో స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేయాలని ఇటీవలె నిర్ణయించిన తెలంగాణ ప్రభుత్వం.. ఈ అంశాన్ని పున:సమీక్షించింది. 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ ఉత్తర తెలంగాణ నీటి అవసరాలకు సరిపోదని నిపుణులు ఇచ్చిన సూచనలతో ఒక అంచనాకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. తాజాగా లేఖ రాశారు. అందుకే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో సాగునీరు, తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని.. తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తుపై మరోసారి చర్చ అవసరమని సీఎం రేవంత్ రెడ్డి తన లేఖలో ప్రస్తావించారు.



## 4,117 కోట్ల భూములకు విముక్తి

**ఒక్కరోజులోనే హైదరాబాద్‌లో హైడ్రా భారీ ఆపరేషన్**

**కోకాపేట, ఖానామెట్ ప్రాంతాల్లోని చెరువు కబ్జాలకు చెక్**

హైదరాబాద్, మే 27 (ఈవార్తలు): హైదరాబాద్ మహానగరంలో అత్యంత ఖరీదైన ఐటీ కారిడార్, కోకాపేట పరిసరాల్లో ప్రభుత్వ భూములు, చెరువులను కబ్జా చేస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియాపై 'హైడ్రా' ఉక్కుపాదం మోపింది. మార్కెట్‌లో ఎకరం రూ.150 కోట్లకు పైగా పలికే ఈ ప్రాంతాల్లో బడా రియల్టర్లు పక్కా ప్రణాళికతో సాగిస్తున్న భూదందాకు అడ్డుకట్ట వేసింది. నిన్న నగరం నలువైపులా ఏకకాలంలో భారీ ఆపరేషన్ నిర్వహించి, సుమారు రూ.4,117 కోట్ల విలువైన ప్రభుత్వ, చెరువు శిఖం భూములను స్వాధీనం చేసుకుంది. ఆక్రమణలను తొలగించి, ఆ భూముల చుట్టూ రక్షణ కంచెలను ఏర్పాటు చేసింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా కోకాపేటలో ప్రముఖ స్థిరాస్తి సంస్థలు సాగిస్తున్న అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. కొత్తచెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలోని 1.09 ఎకరాల భూమిని ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ ఆక్రమించుకుంది. 'గోల్డ్‌ఫిష్ కాలనీ' పేరుతో అక్కడ విల్లాలను నిర్మించడమే కాకుండా మిగిలిన చెరువు భాగాన్ని మట్టితో పూడ్చివేసి నివాసితుల కోసం లగ్జరీ గార్డెన్లు, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు నిర్మించింది. స్థానికులు ప్రజావాణిలో చేసిన ఫిర్యాదుల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన హైడ్రా అధికారులు, అది చెరువు భూమి అని నిర్ధారించుకుని అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఇదే ప్రాంతంలోని పెద్దచెరువు పరిధిలో బహుళ అంతస్తుల భవనాల కోసం ఆక్రమించిన సుమారు 22 ఎకరాల స్థలాన్ని కూడా అధికారులు కాపాడారు. ఒక్క కోకాపేటలోనే స్వాధీనం చేసుకున్న భూముల విలువ రూ.3,000 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. రోవైపు శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లోని ఈదులకుంట చెరువును ఏకంగా మ్యాప్ నుంచే తొలగించేందుకు జరిగిన భారీ కుట్రను హైడ్రా భగ్నం చేసింది. తమ్మిడికుంట చెరువు నిండినప్పుడు వచ్చే వరద నీటి కాలువను కబ్జాదారులు దారి మళ్లించి, చెరువు ఎండిపోయేలా చేశారు. ఆ స్థలంలో భారీ ఆకాశహర్మ్యాలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు విచారణలో ఉంది. హైడ్రా అధికారులు శాటిలైట్ చిత్రాలు, పాత ఎఫ్‌టీఎల్ రికార్డుల ఆధారంగా 6.50 ఎకరాల చెరువు స్థలాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. దీని మార్కెట్ విలువ 600 కోట్లు. దీనికి ఆనుకుని ఉన్న రూ.500 కోట్ల విలువైన 5.16 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా అధికారులు కాపాడారు.

## నెలలో పెళ్లి.. గుండెపోటుతో యువకుడు మృతి

హైదరాబాద్, మే 27 (ఈవార్తలు): అమెరికాలో మరో తెలుగు యువకుడు ప్రాణాలు కోల్పోయారు. వెర్మాంట్ రాష్ట్రంలోని బర్లింగ్‌టన్‌లో నివాసముంటున్న జి.నితిన్ రెడ్డి (27) గుండెపోటుతో మరణించారు. వచ్చే నెలలోనే నితిన్ వివాహానికి కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో ఈ విషాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. అయితే, ఇటీవలే ఉద్యోగం కోల్పోవడం, వివాహ సమయం దగ్గర పడుతుండడంతో నితిన్ తీవ్ర ఒత్తిడికి గురైనట్లు తెలుస్తోంది.

# అమ్కా యుద్ధ విమానాలు ప్రైవేట్‌కు!

## పుట్టపర్తిలో యుద్ధ విమానాలు తయారీ కేంద్రం.. తొలిసారి ప్రైవేట్ సంస్థలకు ఆహ్వానం

**అమెరికా, చైనా, రష్యా దేశాల సరసన భారత్**

న్యూఢిల్లీ/పుట్టపర్తి, మే 27 (ఈవార్తలు): భారత రక్షణ రంగంలో ఒక చారిత్రాత్మక అడుగు పడింది. దేశీయంగా అభివృద్ధి చేయనున్న అత్యాధునిక 5జీ స్టెల్త్ ఫైటర్ జెట్ అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీకి సంబంధించి రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్‌ను కేంద్రం బుధవారం జారీ చేసింది. ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌ను పక్కనపెట్టి, ప్రైవేట్ సంస్థలను ఆహ్వానించడం ఇదే మొదటిసారి. ఈ రేసులో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, ఎల్ అండ్ టీ బెల్ డైనమాటిక్ కన్సార్టియం, భారత్ ఫోర్జ్ - బీఇఎమ్ఎల్ - డేటా పాటర్న్ కన్సార్టియం ఉన్నాయి. రూ. 15 వేల కోట్ల విలువైన ఈ ప్రాజెక్టులో భాగంగా ఎంపికైన సంస్థ.. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయబోయే సరికొత్త గ్రీన్‌ఫీల్డ్ ఫెసిలిటీలో ఐదు 'అమ్కా' నమూనాలను తయారు చేయాల్సి ఉంటుంది. భారత్‌లో యుద్ధ విమానాల తయారీలో ప్రైవేట్ రంగానికి తలుపులు తెరవడమే కాకుండా, వేగవంతమైన అభివృద్ధికి ఇది హామీ ఇస్తుంది. అంతేకాకుండా, ఆత్మనిర్భర భారత్ ఆశయానికి ఇది మరింత బలాన్ని చేకూరుస్తుంది. 'అమ్కా' యుద్ధ విమాన నమూనాల తయారీకి అవసరమైన రూ. 15,000 కోట్ల నిధులను ప్రభుత్వమే పూర్తిగా సమకూరుస్తుంది. టెండర్ దక్కించుకునే ప్రయివేట్ సంస్థ.. డీఆర్డీఓ పరిధిలోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) తో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. ఐదు ఫ్లయింగ్ ప్రొటోటైప్‌లను, ఒక స్ట్రక్చరల్ టెస్ట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను తయారు చేస్తారు. ఈ పనులన్నీ ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో నిర్మించనున్న 650 ఎకరాల భారీ కొత్త ప్లాంట్‌లో జరుగుతాయి. ఈ స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్ట్ కోసం గతేడాది నవంబరులో టెండర్ జారీ చేయగా.. ఏడు సంస్థలు బిడ్‌లను దాఖలు చేశాయి. ఫిబ్రవరిలో జరిగిన సాంకేతిక పరిశీలన తర్వాత మూడు సంస్థలను షార్ట్‌లిస్ట్ చేశారు. షార్ట్‌లిస్ట్ అయిన సంస్థలకు బిడ్‌లను సమర్పించడానికి రెండు నుంచి మూడు నెలల



సమయం ఉంది. అత్యంత తక్కువ ధరకు కోట్ చేసిన 'హ1' సంస్థ ఎంపిక, కాంట్రాక్ట్ కేటాయింపులు జనవరి-మార్చి 2027 నాటికి పూర్తవుతుందని భావిస్తున్నారు. మొదటి నమూనా విమానం తొలి విమాన పరీక్ష 2028- 2032 మధ్య జరిగే అవకాశం ఉంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే 2035 తర్వాత ఈ విమానాలు భారత వైమానిక దళంలోకి ప్రవేశిస్తాయి. అనంతరం పుట్టపర్తి ప్లాంట్‌లోనే భారీస్థాయి ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఈ యుద్ధ విమానాలు రక్షణ దళాల్లో చేరితే ప్రపంచంలోని అగ్ర దేశాల సరసన భారత్ చేరుతుంది. మే 2025 నాటికి అమెరికా (ఎఫ్- 22, 35), చైనా (జే-20), రష్యా (సుఖోయ్-57) వద్ద మాత్రమే ఈ రకమైన సాంకేతికత ఉంది.

# 30న డీకే ప్రమాణం?

## డిప్యూటీ సీఎంలుగా ముగ్గురికి అవకాశం.. కర్ణాటక నాయకత్వ మార్పుపై కాంగ్రెస్ అధిష్ఠానం ముమ్మర చర్యలు



బెంగళూరు: కర్ణాటకలో నాయకత్వ మార్పుపై కాంగ్రెస్ హైకమాండ్ చర్యలు ముమ్మరం చేసింది. ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను పదవి నుంచి తప్పుకోనుండగా.. మే 30న కొత్త సీఎం ప్రమాణస్వీకారం చేసే అవకాశాలున్నాయని కాంగ్రెస్ వర్గాల తాజా సమాచారం. ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్‌తో పాటు ముగ్గురు డిప్యూటీ సీఎంలు ఉంటారని తెలుస్తోంది. సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యత ఇస్తూ.. ఒక ఎస్సీ, ఒక ఓబీసీ సహా ఒక మహిళకు ఉప-ముఖ్యమంత్రులుగా అవకాశం కల్పిస్తారని సమాచారం. సిద్ధరామయ్య కుమారుడు యతీంద్రకు డిప్యూటీ సీఎం పదవి ఇస్తామని కాంగ్రెస్ అధిష్ఠానం హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఢిల్లీలో కాంగ్రెస్ ముఖ్యనేతలతో మంగళవారం ఉదయం నుంచి సుదీర్ఘంగా సాగిన సమావేశంలో సీఎం పదవి నుంచి తప్పుకోడానికి సిద్ధరామయ్య అంగీకరించారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆయన రాజ్యసభ సీటుతో పాటు జాతీయ రాజకీయాల్లో కీలక ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం రాజ్యసభలో విపక్ష నేతగా ఉన్న మల్లికార్జున ఖర్గే పదవీకాలం వచ్చే నెలతో ముగియనుండగా.. ఆ స్థానంలో సిద్ధూను కూర్చోబెట్టనున్నట్టు సమాచారం. డీకే శివకుమార్ నేతృత్వంలోని ప్రభుత్వంలో ఆయన మద్దతుదారులకు సరైన ప్రాధాన్యత కల్పిస్తామని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనపై ఆలోచించడానికి తనకు కొంత సమయం కావాలని సిద్దరామయ్య కోరినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అయితే, డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా ఎంత త్వరగా ప్రమాణ స్వీకారం చేస్తారు అన్నదే ఇప్పుడు ప్రశ్న. సిద్ధరామయ్య గురువారం లేదా శుక్రవారమే రాజీనామా చేయడం, కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ వారాంతంలోనే జరగడం. అలాగే, అధికార బదిలీపై అంగీకారం కుదిరినందున, సిద్ధరామయ్య త్వరలోనే రాజీనామా చేస్తారని పార్టీ భావిస్తోంది. కానీ రాజకీయాల్లో ఏదీ పూర్తయ్యే వరకు పూర్తయినట్లు కాదు. ఒకవేళ సిద్ధరామయ్య తన రాజీనామా నిర్ణయాన్ని వాయిదా వేసుకుంటే.. రాజ్యసభ ఎన్నికల తర్వాత అంటే జూన్ 18 వరకు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వాయిదా వేసే అవకాశం ఉందని వర్గాలు చెబుతున్నాయి. కర్ణాటలో మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనుండగా, కాంగ్రెస్ ఒక స్థానాన్ని సిద్ధరామయ్యకు ఆఫర్ చేసింది. రెండోది సిట్టింగ్ ఎంపీగా ఉన్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు, మిగతాది డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేష్‌కు దక్కే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి.

# బీజేపీలోకి 50 మంది టీఎంసీ ఎమ్మెల్యేలు?

**మరో 20 మంది ఎంపీలు కూడా??**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కలకలం రేగుతోంది. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కి చెందిన దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు, 20 మంది ఎంపీలు పార్టీ నాయకత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, బీజేపీ కేంద్ర నాయకత్వం పచ్చజెండా ఊపితే వారంతా కాషాయ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారని బీజేపీ ఎంపీ సౌమిత్ర ఖన్ బుధవారం సంచలన ప్రకటన చేశారు. ఒకవేళ వీరందరినీ చేర్చుకోవాలని బీజేపీ నిర్ణయిస్తే తృణమూల్ కాంగ్రెస్ ఒక రాజకీయ శక్తిగా ఉనికినే కోల్పోతుందని ఆయన పేర్కొన్నారు. అయితే, సౌమిత్ర ఖన్ చేసిన ఈ వ్యాఖ్యలను తృణమూల్ సీనియర్ ఎంపీ సౌగతా రాయ్ పూర్తిగా ఖండించారు. ఇదంతా అబద్ధమని, బీజేపీ ఉద్దేశపూర్వకంగానే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోందని కొట్టిపారేశారు. ఇదే సమయంలో సౌమిత్ర ఖన్ టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయనను ఒక 'పాపి'గా అభివర్ణిస్తూ, పాపం చేసిన వారు జైలుకు వెళ్లక తప్పదని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఆయన ఇంటి ముందు బుల్డోజర్ సిద్ధంగా ఉందని, గతంలో బీజేపీ కార్యకర్తల ఇళ్లను కూల్చివేయించినందుకు ఆయన తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఘాటుగా విమర్శించారు.

# ఐఫోన్‌ను దొంగిలించలేరు!

**చోరీలను అడ్డుకునేందుకు ఆటోమేటిక్ లాక్**

**కొత్త ఫీచర్ కోసం ఇన్ బిల్ట్ సెన్సర్ల వినియోగం**



న్యూఢిల్లీ: మీ చేతిలో ఐఫోన్ అన్‌లాక్ చేసి ఉండగా ఎవరైనా లాక్కొని పారిపోతే కేవలం కొన్ని సెకన్లలోనే మీ బ్యాంకింగ్ యాప్స్, పాస్‌వర్డ్‌లు ప్రమాదంలో పడొచ్చు. ఇలాంటి దొంగతనాలకు చెక్ పెట్టేందుకు యాపిల్ సంస్థ ఒక అద్భుతమైన సెక్యూరిటీ ఫీచర్‌ను అభివృద్ధి చేస్తోంది. ఫోన్‌ను ఎవరైనా చేతి నుంచి లాక్కున్నట్లు గుర్తిస్తే ఆ మరుక్షణమే ఐఫోన్ ఆటోమేటిక్‌గా లాక్ అయ్యేలా కొత్త వ్యవస్థను డిజైన్ చేస్తున్నారు. ఐఫోన్‌లోని వివిధ సెన్సర్ల సాయంతో ఈ ఫీచర్ పనిచేస్తుంది. ముఖ్యంగా ఫోన్ కదలికలను గమనించే 'యాక్సిలెరోమీటర్' చిప్ ద్వారా ఎవరైనా ఫోన్‌ను చేతి నుంచి గట్టిగా లాక్కున్నప్పుడు వచ్చే కుదుపును సిస్టమ్ గుర్తిస్తుంది. ఒకవేళ అలాంటి అసాధారణ వేగం, కదలిక కనిపిస్తే ఫోన్ స్క్రీన్ వెంటనే లాక్ అయిపోతుంది. దీనివల్ల దొంగ చేతికి ఫోన్ చిక్కినా లోపల ఉన్న డేటాను ఓపెన్ చేయలేడు. ఈ సరికొత్త ఫీచర్‌లో యాపిల్ వాచ్ కూడా కీలక పాత్ర పోషించనుంది. యూజర్ చేతికి ఉన్న యాపిల్ వాచ్‌కు, ఐఫోన్‌కు మధ్య ఉన్న దూరాన్ని సిస్టమ్ నిరంతరం గమనిస్తుంది. ఫోన్ అన్‌లాక్డ్‌గా ఉన్నప్పుడు వాచ్‌కు, ఫోన్‌కు మధ్య కనెక్షన్ సిగ్నల్ ఒక్కసారిగా పడిపోయినా లేదా దూరం వేగంగా పెరిగినా దాన్ని దొంగతనంగా ఫోన్ గుర్తిస్తుంది. వెంటనే ఫోన్‌ను లాక్ చేయడంతో పాటు భద్రతను కట్టుదిట్టం చేస్తుంది. యాపిల్ ఇప్పటికే అందిస్తున్న 'స్టోలెన్ డివైజ్ ప్రొటెక్షన్' నిబంధనల ఆధారంగానే ఈ కొత్త ఫీచర్ కూడా పనిచేస్తుంది. ఫోన్ ఇంట్లో లేదా ఆఫీస్ లాంటి నమ్మకమైన వైఫై నెట్‌వర్క్‌లో కాకుండా ఏదైనా కొత్త ప్రదేశంలో ఉన్నప్పుడు ఈ లాకింగ్ సిస్టమ్ మరింత అగ్రెసివ్‌గా మారుతుంది. ఆండ్రాయిడ్ ఫోన్లలో ఇప్పటికే ఉన్న 'థెఫ్ట్ డిటెక్షన్ లాక్' తరహాలోనే ఈ ఫీచర్‌ను యాపిల్ డెవలప్ చేస్తోంది. త్వరలోనే రాబోయే ఐఓఎస్ అప్‌డేట్లలో ఇది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# ఎండలు కొడుతున్నయ్.. నీళ్లు తాగండి!

**ప్రజలకు ప్రధాని మోదీ సూచనలు**

న్యూఢిల్లీ: దేశంలోని చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు కీలక సూచనలు చేశారు. తీవ్రమైన వేడి పరిస్థితుల్లో పలు జాగ్రత్తలు సూచించారు. నిత్యం తగినంత నీరు తాగాలని అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదిక ద్వారా ఆయన ప్రజలకు జాగ్రత్తలు చెప్పారు. వీలైనంత వరకు మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లవద్దని సూచించారు. అతి తీవ్రమైన వేడి నుంచి ప్రజలు తమను తాము కాపాడుకోవాలని అన్నారు. వృద్ధులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు. సాధ్యమైనంత వరకు ఇతరులకు సహాయం చేయాలని, ఇళ్లు, దుకాణాల వద్ద ఆరుబయట పక్షులు, జంతువుల కోసం నీటిని ఉంచాలని కోరారు. ఎండ కారణంగా ఎవరికైనా ఏమైనా అయితే ఏం జాగ్రత్తలు తీసుకోవాలో సూచనలు చేశారు. తల తిరగడం, వికారం, అలసట వంటి వడదెబ్బ లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. చుట్టూ ఉన్నవారిలో ఎవరైనా అకస్మాత్తుగా స్పృహ కోల్పోయినట్లు అనిపించినా, నీరసించినా వెంటనే వారిని నీడ ఉన్న ప్రదేశానికి తీసుకువెళ్లాలని అన్నారు. ఇలాంటి సమయాల్లో అప్రమత్తంగా వ్యవహరించడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడుతామని పేర్కొన్నారు. అధిక ఉష్ణోగ్రతల ప్రభావం పిల్లలు, వృద్ధులు, రైతులు, కార్మికులపై ఎక్కువగా ఉంటోందని అన్నారు. రాబోయే రోజుల్లో ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. హర్యానా, రాజస్థాన్, బీహార్, ఒడిశా, తెలంగాణ, కోస్తా, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు వీస్తున్నాయి. మే 29 నుంచి ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే కురిసే అవకాశం ఉందని తెలిపింది.



# హైడ్రోజన్ రైలు వచ్చేస్తోంది!

**ఉదజని ఆధారిత రైలుకు గ్రీన్ సిగ్నల్.. జింద్-సోనిపట్ మార్గంలో ఏర్పాటుకు ఆమోదం**

న్యూఢిల్లీ: పర్యావరణ హితమైన, సుస్థిర రవాణా దిశగా భారత రైల్వే ఒక చరిత్రాత్మక ముందడుగు వేసింది. దేశంలోనే తొలిసారిగా హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీతో నడిచే రైలును ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపింది. ఉత్తర రైల్వే పరిధిలోని జింద్-సోనిపట్ మార్గంలో 10 బోగీలతో కూడిన ఈ హైడ్రోజన్ రైలును నడపనున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ నేడు ఒక ప్రకటనలో వెల్లడించింది. త్వరలోనే ప్రారంభం కానున్న ఈ రైలు గంటకు 75 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణిస్తుంది. దీనికోసం 1,200 కిలోవాట్ల సామర్థ్యం గల హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ ప్రొపల్షన్ వ్యవస్థను ఉపయోగిస్తున్నారు. ఈ టెక్నాలజీలో హైడ్రోజన్‌ను ఉపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు. ఈ ప్రక్రియలో కేవలం నీటి ఆవిరి మాత్రమే వెలువడుతుంది. దీంతో సంప్రదాయ ఇంధనాలతో పోలిస్తే కాలుష్యం పూర్తిగా ఉండదు. ఈ చొరవతో హైడ్రోజన్ టెక్నాలజీని రైల్వే రంగంలో పరీక్షిస్తున్న జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి అతికొద్ది దేశాల సరసన భారత్ చేరింది. హర్యానాలోని జింద్-సోనిపట్ మార్గాన్ని ఈ పైలట్ ప్రాజెక్టు కోసం ఎంపిక చేశారు. రైలుకు అవసరమైన హైడ్రోజన్ ఇంధనాన్ని నింపేందుకు జింద్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో రీఫ్యూయలింగ్, నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో కంప్రెస్డ్ హైడ్రోజన్ గ్యాస్ నిల్వ, పంపిణీ కోసం పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (పీఈఎస్ఓ) నుంచి అవసరమైన లైసెన్సు కూడా లభించింది. ప్రయాణికుల భద్రతకు రైల్వే అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. జింద్‌లోని రీఫ్యూయలింగ్ కేంద్రంలో హైడ్రోజన్ లీక్ డిటెక్టర్లు, ఫ్లేమ్ డిటెక్టర్లతో సహా పలు భద్రతా సెన్సార్లను ఏర్పాటు చేశారు. రైలు నిర్వహణ కోసం షకుర్‌బస్తీలో ఏర్పాటు చేయనున్న ఫెసిలిటీలో కూడా కఠినమైన భద్రతా ప్రమాణాలను అమలు చేయనున్నారు.

# అదానీ పవర్‌కు మస్తు గిరాకీ

**ఎండల తీవ్రతతో విద్యుత్ షేర్లకు పెరిగిన డిమాండ్**

న్యూఢిల్లీ: భారత స్టాక్ మార్కెట్లో అదానీ గ్రూప్‌నకు చెందిన 'అదానీ పవర్' సరికొత్త మైలురాయిని అందుకుంది. దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌ను వెనక్కి నెట్టి అత్యంత విలువైన కంపెనీల జాబితాలో ముందుకు దూసుకెళ్లింది. ఈ ఏడాది ఇప్పటివరకు షేర్ల ధర ఏకంగా 68 శాతం మేర పెరగడంతో మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా అదానీ పవర్ ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. బుధవారం నాటి ట్రేడింగ్‌లో అదానీ పవర్ షేరు దాదాపు 3 శాతం లాభపడి రూ.252 వద్ద సరికొత్త 52 వారాల గరిష్ఠాన్ని తాకింది. ఈ భారీ పెరుగుదలతో కంపెనీ మొత్తం మార్కెట్ విలువ సుమారు రూ.4.85 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో ఇన్ఫోసిస్ మార్కెట్ విలువ రూ.4.72 లక్షల కోట్ల వద్దే నిలిచిపోయింది. దీంతో దేశంలోనే అత్యంత విలువైన కంపెనీల జాబితాలో అదానీ పవర్ 11వ స్థానానికి ఎగబాకింది. దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు అదానీ పవర్ షేర్లకు కలిసొచ్చాయి. ఎల్‌నినో ప్రభావం వల్ల తీవ్రమైన ఎండలు ముదరడంతో విద్యుత్ వినియోగం పెరిగింది. మే 22 నాటి గణాంకాల ప్రకారం.. ప్రపంచంలోని అత్యధిక ఉష్ణోగ్రత్తలు నమోదైన 100 నగరాల్లో 97 భారతదేశంలోనే ఉండటం గమనార్హం.

# ఎబోలా కొత్త వేరియంట్‌కు రష్యా వ్యాక్సిన్

మాస్కో: ఆఫ్రికా దేశాలను వణికిస్తున్న ఎబోలా కొత్త వేరియంట్‌కు తమ శాస్త్రవేత్తలు సరికొత్త వ్యాక్సిన్ కనుగొన్నట్లు రష్యా ప్రకటించింది. కాంగో, ఉగాండా దేశాల్లో బుండిబుగ్యో అనే కొత్త రకం ఎబోలా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతుండటంతో 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' (డబ్ల్యూహెచ్ఓ) ఇప్పటికే అంతర్జాతీయ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించింది. ఈ ప్రాణాంతక వేరియంట్‌కు ఇప్పటివరకు ఎలాంటి గుర్తింపు పొందిన టీకా లేకపోవడంతో రష్యా తెచ్చిన కొత్త ఆవిష్కరణకు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం సెంట్రల్ ఆఫ్రికా దేశాల్లో బుండిబుగ్యో ఎబోలా రకం తీవ్ర కలకలం రేపుతోంది. కాంగోలో దీని తీవ్రత అత్యంత ప్రమాదకర స్థాయికి చేరినట్లు డబ్ల్యూహెచ్ఓ వెల్లడించింది. ఇప్పటికే అక్కడ వందలాది మంది ఈ వైరస్ బారిన పడ్డారు. డజన్ల కొద్దీ మరణాలు సంభవించడంతో అంతటా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ కొత్త ముప్పును అడ్డుకోవడం వైద్య నిపుణులకు సవాలుగా మారింది.

# రైల్వే ఉద్యోగుల జీతాలు 400 శాతం పెంపు?

**8వ పే కమిషన్ ముందు రైల్వే ఉద్యోగ సంఘం ప్రతిపాదన**

**వివిధ పే లెవెల్స్‌కు వేర్వేరు ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్లు అమలు చేయాలని డిమాండ్**

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ కోసం ఏర్పాటు చేసిన 8వ పే కమిషన్ కార్యకలాపాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కేవలం జీతాలు, పెన్షన్ల పెంపునకు పరిమితం కాకుండా, ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం ఎంతవరకు నెరవేర్చగలదనే ఆర్థిక చర్చకు ఇది దారితీసింది. ముఖ్యంగా, సీనియర్ ఉద్యోగుల జీతాలను ఏకంగా 400 శాతానికి పైగా పెంచే ఒక ప్రతిపాదన అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. 8వ పే కమిషన్‌తో జరుగుతున్న సంప్రదింపుల ప్రక్రియలో, ఇండియన్ రైల్వే టెక్నికల్ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ ఈ సంచలన ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. గత పే కమిషన్‌ల మాదిరిగా అందరికీ ఒకే ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ కాకుండా, ఉద్యోగుల పే లెవెల్స్ ఆధారంగా ఐదు వేర్వేరు ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్లను అమలు చేయాలని కోరింది. ఇది గత సంప్రదాయాలకు పూర్తి భిన్నమైనది. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదిస్తే, జీతాల్లో భారీ పెరుగుదల ఉంటుంది. ఉదాహరణకు లెవెల్ 17-18లో రూ.2.5 లక్షల బేసిక్ పే ఉన్న ఉద్యోగి జీతం, 4.38 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌తో దాదాపు రూ.10.95 లక్షలకు చేరుతుంది. అలాగే, మధ్యస్థాయి ఉద్యోగి రూ.45,000 బేసిక్ పే, 3.50 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌తో రూ.1.57 లక్షలకు పెరుగుతుంది. ప్రస్తుత వేతన విధానంలో జూనియర్, సీనియర్ ఉద్యోగుల మధ్య జీతాల వ్యత్యాసం తగ్గిపోయిందని, ముఖ్యంగా భద్రతాపరమైన విధుల్లో ఉన్న సాంకేతిక సిబ్బందికి అన్యాయం జరుగుతోందని ఐఆర్‌టీఎస్ఏ వాదిస్తోంది.

# స్టాక్ మార్కెట్లకు స్వల్ప నష్టాలు

ముంబై: బుధవారం నాటి ట్రేడింగ్‌లో దేశీయ స్టాక్ మార్కెట్లు ఒడుదొడుకుల మధ్య స్వల్ప నష్టాలతో ముగిశాయి. ప్రధానంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి, అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్లను ఆచితూచి అడుగులు వేసేలా చేశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, 30 షేర్ల సెన్సెక్స్ 141.90 పాయింట్లు నష్టపోయి 75,867.80 వద్ద స్థిరపడింది. ఇక, నిఫ్టీ కూడా 6.55 పాయింట్ల స్వల్ప నష్టంతో 23,907.15 వద్ద ముగిసింది. అమెరికా, ఇరాన్ మధ్య సయోధ్యకు చర్చలు జరుగుతున్నప్పటికీ, మంగళవారం దక్షిణ ఇరాన్‌పై అమెరికా దాడులు చేసిందన్న వార్తలు అంతర్జాతీయంగా ఆందోళనలను పెంచాయి. ఈ పరిణామాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీనికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు అమ్మకాల వైపు మొగ్గు చూపడం కూడా ప్రతికూల ప్రభావం చూపింది. టెక్నికల్ పరంగా చూస్తే, నిఫ్టీకి 23,800 పాయింట్ల వద్ద కీలక మద్దతు ఉందని, ఒకవేళ ఈ స్థాయిని కోల్పోతే 23,600-23,500 స్థాయిల వరకు పతనం ఉండొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. అదే సమయంలో, 24,000-24,100 శ్రేణి బలమైన నిరోధకంగా ఉందని, దీనిని దాటితేనే బుల్స్ తిరిగి పట్టు సాధించగలరని పేర్కొన్నారు. నిఫ్టీలో ఓఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు ప్రధాన నష్టాల్లో ఉన్నాయి. మరోవైపు, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎటర్నల్, ఎన్టీపీసీ షేర్లు 2 శాతానికి పైగా లాభపడగా.. టాటా స్టీల్, ఇండిగో, మారుతీ సుజుకీ, టైటాన్ కంపెనీ, ఏషియన్ పెయింట్స్ కూడా లాభాలతో ముగిశాయి. సూచీలు బలహీనంగా ఉన్నప్పటికీ, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్స్ రాణించడం విశేషం. రంగాలవారీగా చూస్తే ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకింగ్ సూచీలు నష్టపోగా, మీడియా, మెటల్, ఆటో సూచీలు లాభపడ్డాయి.

# అత్తామామలు మౌనంగా ఉంటే వేధింపు కాదు!

**వారిపై వరకట్న వేధింపుల కేసు పెట్టలేం: సుప్రీం**

న్యూఢిల్లీ: భార్యాభర్తల మధ్య జరిగే గొడవల్లో అత్తమామలు మౌనంగా ఉన్నంత మాత్రాన వారిపై వరకట్న వేధింపుల కేసులు పెట్టలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నైతికంగా ఆ ప్రవర్తన తప్పు కావచ్చు కానీ, దాన్ని క్రిమినల్ నేరంగా పరిగణించలేమని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. భర్త కుటుంబ సభ్యులందరినీ గుడ్డిగా కేసుల్లోకి లాగడం సరికాదని పేర్కొంది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కె. సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. భర్తకు మద్దతు ఇచ్చారనో, గొడవల్లో జోక్యం చేసుకోలేదనో లేదా సర్దుకుపోవాలని సలహా ఇచ్చారనో చెప్పి కుటుంబ సభ్యులపై క్రిమినల్ చట్టాలను ప్రయోగించలేమని కోర్టు స్పష్టం చేసింది. నేరంలో వారి ప్రత్యక్ష భాగస్వామ్యం లేదా నిర్దిష్టమైన పాత్ర ఉంటే తప్ప కేవలం సాధారణ ఆరోపణలతో అత్తమామలను దోషులుగా నిలబెట్టలేమని ధర్మాసనం వివరించింది. మధ్యప్రదేశ్‌లోని గుణా ప్రాంతానికి చెందిన ఓ మహిళ తన భర్త, అత్తమామలపై పెట్టిన వరకట్న వేధింపుల కేసును సుప్రీంకోర్టు ఈ సందర్భంగా కొట్టివేసింది. సదరు మహిళ తన అత్తమామలపై ఎలాంటి నిర్దిష్టమైన ఆరోపణలు చేయలేదని కోర్టు గుర్తించింది. విఫలమైన వివాహ బంధంలో మహిళ పడే వేదనను తక్కువ చేసి చూడలేమని చెబుతూనే ఇలాంటి వైవాహిక వివాదాల కేసులను విచారించేటప్పుడు కింది కోర్టులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఆరోపణలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించింది. వైవాహిక వివాదాల్లో తీవ్రమైన భావోద్వేగాలు, వ్యక్తిగత కక్షలు దాగి ఉంటాయని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి సమయాల్లో కేవలం భర్తపైనే కాకుండా, గొడవలతో ఎలాంటి సంబంధం లేని అతని కుటుంబ సభ్యులందరినీ కేసుల్లో ఇరికించే ధోరణి ఎక్కువగా కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. నిందితులుగా చేర్చిన వారు నిజంగానే క్రూరత్వానికి పాల్పడ్డారా? లేదా? అదనపు కట్నం కోసం వేధించారా అనేదానికి పక్కా ఆధారాలు ఉండటం చట్టప్రకారం ముఖ్యమని కోర్టు స్పష్టం చేసింది.

# అన్నాడీఎంకేలో భేదాభిప్రాయాలే!: వేలుమణి

చెన్నై: అన్నాడీఎంకే పార్టీలో ఎలాంటి చీలికలేదని, భేదాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని సీనియర్ నాయకుడు వేలుమణి నేతృత్వంలోని రెబల్ ఎమ్మెల్యేలు ప్రకటించారు. వేలుమణి నేతృత్వంలో ఎమ్మెల్యేలు పార్టీ అధినేత పళనిసామితో ఆయన నివాసంలో సమావేశమయ్యారు. అయితే టీవీకే ప్రభుత్వానికి మద్దతివ్వాలని విజ్ఞప్తి చేసిన మాజీ మంత్రి షణ్ముగం మాత్రం ఈ సమావేశానికి హాజరుకాలేదు. పళనిసామితో భేటీ అనంతరం వేలుమణి మాట్లాడుతూ, అన్నాడీఎంకేలో చీలిక లేదని ప్రకటించారు. పళనిసామికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. తామంతా ఐక్యంగానే ఉన్నామని అన్నారు. మొదట షణ్ముగంను కలిసిన తర్వాత ఇక్కడకు వచ్చామని వెల్లడించారు. ఆ తర్వాత వేలుమణి బృందం స్పీకర్‌ను కలిసింది. అసెంబ్లీలో తామంతా ఒకే పార్టీగా పనిచేస్తామని ఆయనకు లేఖను సమర్పించింది.

# దాడి చేస్తే తుక్కురేగ్గొడతాం

**ఐక్యరాజ్యసమితిలో పాక్‌పై భారత్ ఫైర్**

జెనీవా: ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ) వేదికగా పాకిస్థాన్‌పై భారత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత వంటి సూత్రాలను పాకిస్థాన్ యథేచ్ఛగా ఉల్లంఘిస్తోందని ఆరోపించింది. తమపై జరిగే ఉగ్రదాడుల నుంచి తమను తాము రక్షించుకునే పూర్తి హక్కు తమకుందని, పాకిస్థాన్ చర్యలకు తగిన పర్యవసానాలు ఉంటాయని గట్టిగా హెచ్చరించింది. చైనా అధ్యక్షతన జరిగిన యూఎన్ఎస్‌సీ బహిరంగ చర్చలో భారత శాశ్వత ప్రతినిధి, రాయబారి హరీశ్ పర్వతనేని మాట్లాడుతూ.. పాకిస్థాన్ చేసిన ఆధారరహిత ఆరోపణలను తిప్పికొట్టారు. "స్వతంత్ర భారతదేశం ఏర్పడిన నాటి నుంచే, సరిహద్దు ఆక్రమణలతో పోరాడుతోంది.



## మల్లన్న పట్నాల వేడుకల్లో జీవన్ రెడ్డి

రాయికల్, మే 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాయికల్ మండలం రామోజీపేట గ్రామంలో నిర్వహించిన మల్లన్న పట్నాలు, బోనాల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లన్న స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, గ్రామ ప్రజలు ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాల్గొన్న జీవన్ రెడ్డి గ్రామ ప్రజలతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, న్యాయవాది తాటిపర్తి రాంచంద్ర రెడ్డి, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## చలిగల్‌లో యంగ్ ఇండియా స్కూల్, కేవీ స్థల పరిశీలన

జగిత్యాల రూరల్, మే 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా చలిగల్‌లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రియ విద్యాలయానికి సంబంధించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు స్థల పరిశీలన చేపట్టినట్లు పేర్కొన్నారు. నిర్మించనున్న విద్యాసంస్థలకు అవసరమైన అన్ని సదుపాయాలను సమగ్రంగా, ప్రణాళికాబద్ధంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేలా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని పనులు చేపడతామని వివరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల రూరల్ తహసీల్దార్ హకీం, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## బక్రీద్ ప్రార్థనల సమయాలు ఖరారు

జగిత్యాల టౌన్, మే 27 (ఈవార్తలు): బక్రీద్ (ఈదుల్ అధా) పండుగ సందర్భంగా జగిత్యాల పట్టణంలో ప్రత్యేక ప్రార్థనల సమయాలను మిల్లత్-ఎ-ఇస్లామియా అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ బారీ, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖ్వాజా నయీముద్దీన్ మంజూర్, ఈద్గా అధ్యక్షుడు సయ్యద్ జమీల్ అహ్మద్, ప్రకటించారు. పండుగ సందర్భంగా వివిధ ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక నమాజ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రహ్మత్‌పురా పాత ఈద్గాలో ఉదయం 7 గంటలకు ప్రత్యేక నమాజ్ నిర్వహించనుండగా, ఈ ప్రార్థనలను ముఫ్తీ నౌషాద్ అవేస్ ఖాసుమీ నిర్వహించనున్నారు. అనంతరం ఖిల్లా ఈద్గాలో ఉదయం 7:30 గంటలకు ప్రత్యేక నమాజ్ జరగనుండగా, దీనికి హాఫిజ్ సయ్యద్ అబ్రార్ షరీఫ్ నాయకత్వం వహించనున్నారు. అలాగే జామా మసీదులో ఉదయం 8 గంటలకు నిర్వహించే ప్రత్యేక నమాజ్‌ను ముఫ్తీ ఖలీల్ అహ్మద్ ఖాసుమీ నిర్వహించనున్నారు. ప్రార్థనలకు హాజరయ్యే ముస్లిం సోదరులు సమయపాలన పాటిస్తూ నిర్ణీత సమయానికి హాజరుకావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో, సామరస్య వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.



## ఫర్టిలైజర్ దుకాణంపై ఆకస్మిక దాడి

వెల్గటూర్, మే 27 (ఈవార్తలు): వెల్గటూర్ మండలంలో ఎరువులు, విత్తనాల దుకాణాలపై బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కామల్ల మహేష్, ఎస్ఐ పి. ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్‌ను పరిశీలించి వివరాలను సరిచూశారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయించడం, నకిలీ పురుగుమందులు, నకిలీ విత్తనాలు, హెచ్‌టీఈ కాటన్ విత్తనాల విక్రయం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. రైతులకు అవసరమైన సన్న వరి విత్తనాలను మార్కెట్లో అందుబాటులో ఉంచాలని సీడ్ డీలర్లకు అధికారులు సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

# 56 వేల క్వింటాళ్ల మక్కల తూకం పూర్తి

**మిగిలిన 10 వేల క్వింటాళ్లు వారంలో పూర్తి.. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**



రాయికల్, మే 27 (ఈవార్తలు): గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రాయికల్ కొనుగోలు కేంద్రాల్లో 56 వేల క్వింటాళ్ల మక్కల ధాన్యం తూకం జరిగినట్లు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. బుధవారం రాయికల్ పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు రాయికల్ పట్టణంలోని కొనుగోలు కేంద్రాల్లో 1,900 మంది రైతుల నుంచి 56 వేల క్వింటాళ్ల మక్కల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. సుమారు రూ.13 కోట్ల విలువైన ధాన్యం తూకం పూర్తయ్యిందని తెలిపారు. ఇంకా 10 వేల క్వింటాళ్ల మక్కల ధాన్యం తూకానికి సిద్ధంగా ఉందని, వారం రోజుల్లో తూకం ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గతంతో పోలిస్తే ఈసారి మొక్కజొన్న దిగుబడి మూడు రెట్లు అధికంగా వచ్చిందని పేర్కొన్నారు. గతంలో వేసవి కాలంలో సాగునీటి కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనేవారని, అలాగే తాగునీటి సమస్యలు కూడా తీవ్రంగా ఉండేవని గుర్తు చేశారు. భూగర్భ జలాల పెరుగుదలకు గతంలో తొంబర్రావుపేట్ డి-52 కెనాల్ వద్ద తూము ఏర్పాటు చేయడం వల్ల రాయికల్, చెర్లకొండాపూర్ నుంచి బోర్నపల్లి, అటవీ గ్రామీణ ప్రాంతాల వరకు చెరువుల్లో నీరు చేరి భూగర్భ జలాలు పెరిగాయని చెప్పారు. అదేవిధంగా ఇటిక్యాల్, బోర్నపల్లి, కొత్తపేట్ వాగులపై చెక్‌డ్యాంల నిర్మాణంతో భూగర్భ జలాలు మరింత పెరిగాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే రైతుల నుంచి మొక్కజొన్నను కొనుగోలు చేస్తోందని, రైతులు పండించిన మొత్తం మక్కలను కొనుగోలు చేసే విషయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ, మండల నాయకులు, అధికారులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రో ధరలు తగ్గించరెందుకు?: ముఖేశ్ ఖన్నా



జగిత్యాల టౌన్, మే 27 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను ఎందుకు తగ్గించడం లేదని రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ కార్యదర్శి ముఖేష్ ఖన్నా ప్రశ్నించారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ ధర్మపురి అరవింద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణిపై ఆయన విమర్శలు చేశారు. గత పది రోజులుగా వారు చేస్తున్న వ్యాఖ్యలు ప్రజలను తప్పుదారి పట్టించేలా ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణకు కేంద్రీయ విద్యాలయం న్యాయబద్ధంగా రావాల్సిందేనని, అందులో ఎంపీ అరవింద్ ప్రత్యేక గొప్పతనం ఏమీ లేదని పేర్కొన్నారు. స్థలం కేటాయింపులో కొంత జాప్యం జరిగినప్పటికీ దానిని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరికాదన్నారు. భోగ శ్రావణిపై కూడా ఆయన విమర్శలు చేస్తూ పోలీసులపై అనవసర వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. అనుమతుల పరిమితిని దాటి కార్యక్రమాలు నిర్వహిస్తే పోలీసులు చర్యలు తీసుకోవడం సహజమని పేర్కొన్నారు. ఎంపీ అరవింద్, భోగ శ్రావణి ఇద్దరూ పోలీసు అధికారులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ ధరల అంశాన్ని ప్రస్తావిస్తూ 2014లో ఉన్న ధరలతో పోలిస్తే ప్రస్తుతం ధరలు ఎందుకు తగ్గించడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలాగే జగిత్యాల మున్సిపల్ రాజకీయాలపై స్పందిస్తూ 2020 ఎన్నికల్లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సహకారంతోనే భోగ శ్రావణి చైర్‌పర్సన్‌గా గెలిచారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఖుర్షీద్ అలీ, సేవాదళ్ జిల్లా బాధ్యులు ద్యావన్‌పల్లి రాజేందర్, భోగ నాగభూషణం, ఉషాకోల గంగాధర్, కామటాల జగదీష్, అబ్దుల్ రహీం, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో ఘనంగా నెహ్రూ వర్ధంతి వేడుకలు



జగిత్యాల టౌన్, మే 27 (ఈవార్తలు): మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దేశ నిర్మాణానికి చేసిన సేవలు మరువలేనివని జిల్లా డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య అన్నారు. కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి బోగోజీ ముకేష్ ఖన్నా ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలోని తహశీల్ చౌరస్తా వద్ద పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 62వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గాజెంగి నందయ్య నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానంతరం భారత అభివృద్ధికి పునాదులు వేసిన మహానేతగా నెహ్రూను కొనియాడారు. ప్రజాస్వామ్య విలువలకు మార్గదర్శిగా, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి కృషి చేసిన దూరదృష్టి గల నాయకుడిగా ఆయన సేవలను గుర్తు చేశారు. దేశ అభివృద్ధి కోసం ఆయన ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, సమిండ్ల శ్రీనివాస్, కౌన్సిలర్ కుర్మచలం అనిల్, బండ శంకర్, దుమల రాజ్‌కుమార్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు భార్గవ్, బొల్లి శేఖర్, కుర్షీద్, ద్యావన్‌పల్లి రాజేందర్, భోగ నాగభూషణం, ఉషాకోలా గంగాధర్, కమాటాల జగదీష్, ప్రతాప్, కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మామిడి రైతుకు అండగా దావ వసంత

రాయికల్, మే 27 (ఈవార్తలు): జగిత్యాల నియోజకవర్గంలోని రాయికల్ మండలం ధర్మాజీపేట గ్రామానికి చెందిన లావుడ్య సురేష్ అనే రైతు మామిడి తోట ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతై పూర్తిగా దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ బుధవారం ఘటన స్థలానికి చేరుకుని దగ్ధమైన మామిడి తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతును పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి రైతుకు త్వరితగతిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బర్కం మల్లేష్, మాజీ సర్పంచ్ లావుడ్య నందునాయక్, నాయకులు మారంపెల్లి సాయికుమార్, అంగోత్ తిరుపతి, వాసాల రాంప్రసాద్, ధర్మాజీపేట బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహానాడు కాదు.. దగానాడు

**మాజీమంత్రి రోజా తీవ్ర విమర్శలు**

తాడేపల్లి, మే 27 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వైసీపీ నేతలు విమర్శల జోరు పెంచారు. తాడేపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి ఆర్కే రోజా కూటమి పాలనపై, ముఖ్యంగా నారా లోకేశ్ పదోన్నతిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. టీడీపీ నిర్వహిస్తున్న మహానాడును 'దగానాడు'గా అభివర్ణించిన రోజా... వైసీపీ నేతలను అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో జగన్ చేసిన అభివృద్ధి పనులను తమ ఖాతాలో వేసుకుంటూ క్రెడిట్ చోరీ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం సొంతంగా ప్రారంభించి పూర్తి చేసిన ఒక్క పనినైనా చూపించగలదా అని ప్రశ్నించారు. అలాగే ఎన్నికల ముందు ప్రకటించిన 'సూపర్ సిక్స్' పథకాలు ఏమయ్యాయని, అవి సూపర్ హిట్ ఎలా అయ్యాయో విమర్శించిన రోజా... మంత్రిగానే సరిగ్గా పని చేయని లోకేశ్‌ను ఇప్పుడు ఏకంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎలా చేశారని నిలదీశారు.



## కోటిలింగాల ఆలయంలో తనిఖీలు

వెల్గటూర్, మే 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని కోటిలింగాల గ్రామంలో ఉన్న ప్రముఖ శ్రీ కోటేశ్వర స్వామి దేవస్థానం పరిసరాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి సూచనలతో ధర్మపురి సీఐ ఎ. రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. వెల్గాటూర్ ఎస్ఐ పి. ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల భద్రత దృష్ట్యా అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు లేదా సంచులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పి. ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల సహకారంతోనే శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయగలమని తెలిపారు. ప్రజల భద్రతే లక్ష్యంగా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు.

## ప్రశ్నించే సింహం జగన్: కొడాలి నాని

తాడేపల్లి, మే 27 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్ నేతృత్వంలో పార్టీ కీలక సమావేశం జరిగింది. అనంతరం మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాబోయే రోజుల్లో చంద్రబాబు రెండేళ్ల పాలనలోని వైఫల్యాలను, ప్రజలకు జరిగిన నష్టాలను ఎండగడతామని వారు స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడా ఏకగ్రీవాలు కాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి పోరాడాలని క్యాడర్‌కు కొడాలి నాని పిలుపునిచ్చారు. చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలను ప్రజలంతా గమనిస్తున్నారని, లోకేశ్ ఒక్క శాఖను కూడా సరిగ్గా నడపలేకపోతున్నారని విమర్శించారు. దమ్ముంటే చంద్రబాబు జగన్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.



## జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

జగిత్యాల రూరల్, మే 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరిచే దిశగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ బుధవారం జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలు, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు, నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదులపై ఎటువంటి జాప్యం చేయకుండా వెంటనే స్పందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది అందరూ విధులను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని తెలిపారు. సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారాన్ని కలిగి ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి చోరీలు, గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ తనిఖీలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, రూరల్ ఎస్ఐ ఉమా సాగర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీకి విరాళాల వెల్లువ

**మహానాడు తొలిరోజు 12 కోట్ల విరాళాలు**

మంగళగిరి, మే 27 (ఈవార్తలు): మహానాడు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి విరాళాలు వెల్లువెత్తాయి. హైబ్రిడ్ విధానంలో ఈసారి మహానాడు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇక కార్యక్రమంలో భాగంగా పలువురు నేతలు పార్టీ కోసం తమ విరాళాలు అందించారు. మొత్తంగా తొలిరోజు రూ.12 కోట్ల మేరకు విరాళాలు సమకూరాయి. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు అత్యధికంగా రూ.5 కోట్లు విరాళం అందించారు. ఎంపీ సానా సతీష్ కోటిన్నర రూపాయలు అందిస్తే.. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి కోటి విరాళంగా అందించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ కూడా రూ.కోటి చొప్పున విరాళం అందజేసారు. మహానాడు కార్యక్రమంలో భాగంగా వివిధ తీర్మానాలు ప్రవేశపెట్టారు. అనంతరం జరిగిన చర్చలో 48 మంది నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలపై ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడారు. ప్రతి ఇంటికీ అభివృద్ధి, ప్రతి రైతుకూ భరోసాయే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్న వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.. సూపర్ సిక్స్ పథకాలకు ఎంత ఖర్చు పెడుతున్నదీ వివరించారు. తల్లికి వందనం పథకం కింద 67.27 లక్షల మందికి రూ.10,090 కోట్ల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్రంలోని 46.85 లక్షల మంది రైతులకు రూ.8,985 కోట్లు అందించినట్లు వివరించారు. స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని.. ఈ పథకం కింద ఇప్పటి వరకూ 63.61 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు జరిగాయన్నారు. దీపం 2.0 పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నామని.. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంటే ఇప్పటికే 6.28 లక్షల ఉద్యోగాల కల్పన జరిగిందన్నారు. పీ4 పథకం కింద రాష్ట్రంలోని 2.10 లక్షల కుటుంబాలకు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఇక నెల్లూరు జిల్లా అభివృద్ధి కోసం రూ.13,000 కోట్ల భారీ పెట్టుబడులు తీసుకువచ్చినట్లు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి వివరించారు.

వయ్యారి చిత్రం


తాన్యా హోప్

## పుష్ప నా జీవితాన్నే మార్చేసింది: సునీల్





ఒక్క పాత్ర పడితే చాలు కెరియర్ అమాంతం మారిపోతుంది అనే విషయాన్ని ఇప్పటికే ఎంతోమంది నటీనటులు నిరూపించారు. ఒకరి తర్వాత ఒకరు తమ జీవితంలో అనూహ్యంగా వచ్చే పాత్రలతో తమ కెరియర్ నే మార్చుకొని అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. అలాంటి వారిలో ప్రముఖ సీనియర్ కమెడియన్ సునీల్ కూడా ఒకరు. ఒకప్పుడు తన కామెడీతో ప్రేక్షకులను అలరించిన ఈయన, ఆ తర్వాత సిక్స్ ప్యాక్ బాడీతో హీరోగా సినిమాలు చేసి మెప్పించారు కూడా.. అలాంటి ఈయన ఈ మధ్యకాలంలో విలన్ గా పలు పాత్రలు పోషిస్తూ ఊహించని ఇమేజ్ దక్కించుకుంటున్నారు. ఇక ప్రస్తుతం భాషతో సంబంధం లేకుండా పాన్ ఇండియా భాషలలో అవకాశాలు అందుకుంటూ బిజీగా మారిన సునీల్ తాజాగా ఒక సినిమా కార్యక్రమంలో పాల్గొని, ఆ సినిమా తర్వాత తన కెరియర్, తన జీవితం పూర్తిగా మారిపోయాయి అంటూ తెలిపారు. 'పుష్ప సినిమా తర్వాత నా లైఫ్ ఒక సర్ప్రైజింగ్ మోడ్ లోకి వెళ్లిపోయింది. అన్ని భాషల నుంచి నాకు అవకాశాలు వస్తున్నాయి. ముఖ్యంగా ఏ భాష నుంచి ఎప్పుడు ఎవరి సినిమా వస్తుందో కూడా నాకు తెలియడం లేదు. ఎలాంటి క్యారెక్టర్ వస్తుందో కూడా నాకు తెలియదు. జైలర్ సినిమా చూశాక కేరళ సెట్ కు వెళ్తే తమిళ్లో సీన్ పేపర్ ఇచ్చేస్తున్నారు. అలా అన్ని భాషల నుండి నాకు అవకాశాలు వస్తున్నాయి. ముఖ్యంగా ఈ కాటాలన్ సినిమాలో నా పాత్ర పేరు మారి . కథలో చాలా కీలకంగా ఉంటుంది. ఎంతో సంతృప్తిని ఇచ్చిన పాత్ర ఇది. ఇప్పటివరకు ఇలాంటి వెరైటీ పాత్రను నేను ఎప్పుడూ చేయలేదు.. ముఖ్యంగా ఈ కథ విన్నప్పుడు నేను ఎంతో సర్ప్రైజ్ అయ్యాను. పైగా ఇందులో ఒక పాట కూడా చేశాను. కాటాలన్ జర్నీ నాకు ఎంతో ప్రత్యేకం' అంటూ పేర్కొన్నారు.

## క్లిష్ట పరిస్థితుల్లో సినీ ఇండస్ట్రీ : దిల్ రాజు


ప్రస్తుతం ఇండస్ట్రీ చాలా క్లిష్టపరిస్థితుల్లో ఉందని నిర్మాత దిల్ రాజు తెలిపారు. తాను ఈ మాట చెప్పడానికి భయపడనన్నారు. 'సమ్మర్ హాలీడేస్' సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కు దిల్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్త వాళ్లతో సినిమా చేస్తే విజయం వస్తుందని తాను నమ్ముతానంటూ.. సమ్మర్ హాలీడేస్ మంచి హిట్ కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. "ఇండస్ట్రీ ప్రస్తుతం చాలా కష్టకాలంలో ఉందని చెప్పడానికి చాలా మంది భయపడతారు. నేను ఈ విషయాన్ని ధైర్యంగా చెప్పగలను. ప్రేక్షకులను థియేటర్‌లకు తీసుకురావడమే మనందరికీ ఇప్పుడు సవాల్. సమ్మర్ హాలీడేస్ లాంటి సినిమాలు తీసి ఆడియన్స్‌ను



థియేటర్‌కు తీసుకురండి. అప్పుడు ఆటోమేటిక్‌గా మంచి సినిమాలు నిలబడతాయి. చిన్న సినిమాలతో డైరెక్టర్లు అందరూ మంచి పేరు తెచ్చుకుంటున్నారు. కొత్త దర్శకులందరూ మంచి చిత్రాలు తీసి ఇండస్ట్రీని నిలబెట్టండి. చిన్న సినిమాలు ఎంత విజయం సాధిస్తే ఇండస్ట్రీ అంత బాగుంటుంది" అని అన్నారు. "చాలా రోజుల తర్వాత ఒక ఈవెంట్ ఇంత సంతోషంగా జరగడం చూస్తున్నాను. ఈ విషయంలో నిర్మాతలను అభినందించాలి. ఎందుకంటే ఈ మధ్యకాలంలో ఏ ఈవెంట్ కూడా ఇంత అద్భుతంగా జరగలేదు. థియేటర్‌లలో కూడా సందడి కనిపించడం లేదు. ఈ 'సమ్మర్ హాలీడేస్'తో థియేటర్‌లలో సందడి నెలకొనాలని కోరుకుంటున్నా" అని దిల్‌రాజు తెలిపారు.

## రెంటల్ విధానంలోనే 'పెద్ది'

చిరు ఎంట్రీతో తెలంగాణ ఎగ్జిబిటర్ల సమస్య కొలిక్కి వచ్చింది. సినీ పరిశ్రమలో పర్సంటేజీల వివాదం వాయిదా పడింది. జూన్ 4న విడుదల కానున్న 'పెద్ది' సినిమాను రెంటల్ విధానంలోనే ప్రదర్శించాలని ఎగ్జిబిటర్లు నిర్ణయించారు. జూన్ 30 తర్వాత విడుదలయ్యే చిత్రాలకు పర్సంటేజీ విధానం వర్తింపజేస్తామన్నారు. ఈ మేరకు తెలంగాణ ఎగ్జిబిటర్లు తీసుకున్న నిర్ణయంపై చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. ఫిల్మ్ ఛాంబర్ కమిటీ నివేదిక మేరకు నడుచుకోవాలని సూచించారు. చిరంజీవితో భేటీ ముగిసిన అనంతరం.. ఎగ్జిబిటర్ల తరఫున తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెస్‌నోట్ విడుదల చేసింది. జూన్ 30లోగా పర్సంటేజీ సమస్యను పరిష్కరిస్తానని చిరంజీవి హామీ ఇచ్చారని చెప్పింది. జులై 3 నుంచి కొత్త పర్సంటేజీ విధానం అమలు కానుందని తెలిపింది. ఆ రోజు నుంచి రెంటల్ సిస్టమ్ ఉండదని, పర్సంటేజీ విధానంలోనే సినిమాల ప్రదర్శన ఉంటుందని స్పష్టం చేసింది. సింగిల్ స్క్రీన్లలోనూ పర్సంటేజీ విధానంలోనే సినిమాలను ప్రదర్శిస్తామని తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై కొన్ని రోజులుగా చర్చలు జరిగాయి. సమస్య పరిష్కారం కోసం చలన చిత్ర వాణిజ్య మండలి.. నిర్మాతలు, పంపిణీదారులు, ప్రదర్శనకారులతో ఓ ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. అయితే, 'పెద్ది' చిత్రాన్ని అద్దె విధానంలో ప్రదర్శించలేమని ఓ సమావేశంలో పలువురు ఎగ్జిబిటర్లు అభిప్రాయం వ్యక్తంగా చేయగా.. కొందరు నిర్మాతలు వ్యతిరేకించారు. దీంతో, ఈ వ్యవహారంపై చిరంజీవి జోక్యం చేసుకున్నారు. ఈనెల 25న ఆయనతో భేటీ అయిన ఎగ్జిబిటర్లు.. బుధవారం మరోసారి సమావేశమై, తుది నిర్ణయాన్ని చెప్పారు.



## కమల్ హాసన్‌కు మాటిచ్చిన భాగ్యశ్రీ



కోలీవుడ్ నటుడు శివ కార్తికేయన్ 'సెయాన్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కమల్ హాసన్ సొంత నిర్మాణసంస్థపై ఈ సినిమా రానుంది. ఇందులో హీరోయిన్‌గా నటిస్తోన్న భాగ్యశ్రీ బోర్సే తాజాగా కమల్‌ను కలిశారు. ఆయనతో దిగిన ఫొటోలను పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. "డియర్ కమల్ హాసన్ సర్.. చిన్నప్పటినుంచి మిమ్మల్ని చూస్తూ పెరిగాను. ఇప్పుడు ఆ చిన్న అమ్మాయి మీ సినిమాలో నటిస్తోంది. మీరు నా తలపై చేయి వేసి ఆశీర్వదించిన క్షణాలను వర్ణించడానికి మాటలు సరిపోవు. మీరు గర్వపడేలా చేస్తానని ప్రామిస్ చేస్తున్నా" అని భాగ్యశ్రీ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటో, ఆమె పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'అమరన్' విజయం తర్వాత శివకార్తికేయన్.. కమల్‌హాసన్ సొంత నిర్మాణసంస్థలో చేస్తున్న రెండో చిత్రమిది. శివకుమార్ మురుగేశన్ తెరకెక్కిస్తున్నారు. "ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే సినిమా. కుటుంబ ప్రేక్షకుల్ని అలరించే భావోద్వేగాలు, మాస్ యాక్షన్, వినోదాన్ని మిళితం చేసుకుని ఉంటుంది" అని టీమ్ తెలిపింది. ఈ సినిమా అక్టోబరులో థియేటర్లలోకి రానుంది.

## ఆ ఒత్తిడి ఎప్పుడూ ఉండేది - సమీరా రెడ్డి



సమీరారెడ్డి ఇన్స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలు షేర్ చేస్తూ "మీకు అందంగా ముస్తాబవడం ఇష్టమా?.. నిజం చెప్పాలంటే నాకు ముస్తాబవడం మీద ఆసక్తి పోయింది. కానీ దానికి కూడా ఒక కారణం ఉంది. ఇంతకుముందు నేను ఎప్పుడూ పర్ఫెక్ట్ గా కనిపించడం గురించి చాలా ఆందోళన చెందేదాన్ని. పైకి కనిపించాలనే ఒత్తిడి నాలో ఎప్పుడూ ఉండేది. కానీ ఇప్పుడు నేను నా లుక్ తో.. నా పద్ధతిలో.. నా స్టైల్ లో ఒత్తిడి లేకుండా అదరగొట్టాలని నిర్ణయించుకున్నాను. ఆ ఒత్తిడిని వదిలేసినప్పుడే వాతావరణం మరింత నిజంగా , అందంగా మారిపోతుంది" అంటూ తన అభిప్రాయాలను పంచుకుంది. మొత్తానికైతే తాను బరువు పెరిగిపోయిన తర్వాత అందంగా కనిపించడం కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డానని.. ఇప్పుడు మానసికంగా మరింత ధైర్యంగా ఉన్నాను కాబట్టే వాటన్నింటినీ వదిలేసాను అంటూ తెలిపింది

## స్థానిక భాషతో మెప్పిస్తా: శ్రీలీల



టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల ఇండస్ట్రీలోకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే తన అద్భుతమైన డాన్స్, చలాకీతనంతో యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినప్పటికీ, ఈ అమ్మడికి టాలీవుడ్‌తో పాటు ఇతర పరిశ్రమల్లోనూ వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ 'డీ–55' ప్రాజెక్ట్‌తో పాటు, బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్ సరసన 'ఆషికీ-3' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది. భాషా భేదాలు లేకుండా ఇండియన్ సినిమాలో దూసుకుపోతున్న శ్రీలీల... తాజాగా భాష, సంస్కృతిపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వివిధ చిత్ర పరిశ్రమల్లో పనిచేయడంపై ఆమె మాట్లాడుతూ.. "నేను ప్రతి భాషను ఎంతో గౌరవిస్తాను. ప్రస్తుతం నాలుగు, ఐదు భాషల్లో ప్రాజెక్టులు చేస్తున్నాను. నేను ఏ కొత్త ప్రాంతానికి వెళ్లినా, స్టేజ్ పైన ఉన్నంతసేపూ అక్కడి స్థానిక భాషలోనే మాట్లాడటానికి ప్రయత్నిస్తాను. ఆ ప్రాంత ప్రజలకు, వారి సంస్కృతికి నేను ఇచ్చే కనీస గౌరవం అది" అని స్పష్టం చేసింది. పబ్లిక్ ఈవెంట్స్‌లో స్థానిక భాషలో మాట్లాడటం వల్ల ప్రేక్షకులకు, సెలబ్రిటీలకు మధ్య ఉన్న దూరం తగ్గి, ఒక మంచి అనుబంధం ఏర్పడుతుందని శ్రీలీల అభిప్రాయపడింది. ఇది కేవలం సినిమా పబ్లిసిటీ కోసం చేసే పని కాదని, మనకు గుర్తింపునిచ్చిన ఆయా ప్రాంతాల ఐడెంటిటీని గౌరవించడమేనని తెలిపింది.

## దంగల్ బ్యూటీ.. బిగువులు



అమాయకపు చూపులతో.. గ్లామర్ అందాలతో కుర్రకారు హృదయాలను దోచుకునే సాన్య మల్హోత్రా గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అమీర్ ఖాన్ ప్రధానోపాత్రలో స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో వచ్చిన దంగల్ సినిమాలో కీలక పాత్ర పోషించి, ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె.. ఈ ఒక్క సినిమాతో ఊహించని విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమా తర్వాత పలు బాలీవుడ్ చిత్రాలలో నటిస్తూ భారీ పాపులారిటీ అందుకున్న సాన్యా.. ఈ మధ్యకాలంలో నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ సెగలు పుట్టించే రేంజ్ లో గ్లామర్ ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటోంది. అందులో భాగంగానే తాజాగా ఇంస్టాగ్రామ్ వేదికగా తాజాగా పంచుకున్న ఫోటోలు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. బికినీనీ ధరించిన ఈమె ఈ అందాలను మరింత ఎలివేట్ చేస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. చిన్న కోట్ ధరించి కొన్ని ఫోటోలలో అందాలు దాచేసిన ఈమె.. మరికొన్ని ఫోటోలలో గ్లామర్ ప్రదర్శన చేసి సోషల్ మీడియాలో మంట రాజేసింది. అటు భిన్నమైన ఫోజులకు నెటిజన్స్ కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. సాన్యా మల్హోత్ర లేటెస్ట్ ఫోటోషూట్ అభిమానులను విపరీతంగా అలరిస్తోంది.




## అంతా ధోనీ ఇష్టం: సీఎస్కే

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ అనగానే అందరికీ గుర్తొచ్చే పేరు మహేంద్ర సింగ్ ధోనీ. సీఎస్కే అంటే ధోనీ, ధోనీ అంటే సీఎస్కే అనేంతలా ఆ జట్టుతో అతడి బంధం ముడిపడిపోయింది. అయితే, మోకాలి గాయం కారణంగా ధోనీ ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడలేకపోయాడు. దీంతో అతడి ఐపీఎల్ కెరీర్ ముగిసిపోయిందనే చర్చలు క్రికెట్ వర్గాల్లో జోరందుకున్నాయి. ఈ ఊహాగానాలపై సీఎస్కే జట్టు సీఈవో కాశీ విశ్వనాథన్ స్పందిస్తూ ఒక సంచలన ప్రకటన చేశారు. ధోనీ జట్టులో ఏ పాత్రలో కొనసాగాలనుకున్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఆ నిర్ణయం పూర్తిగా అతడి వ్యక్తిగత ఇష్టానికే వదిలేస్తున్నామని స్పష్టం చేశారు. “ధోనీ సీఎస్కేలో ఏ పాత్రలో ఉన్నా మాకు ఆనందమే. అతడు ఆటగాడిగా ఉంటాడా, కోచ్‌గా మారతాడా లేదా మెంటార్‌గా సేవలందిస్తాడా అనేది పూర్తిగా అతడి ఇష్టం. సీఎస్కేకు సంబంధించిన ఏ నిర్ణయమైనా ధోనీ అభిప్రాయం పైనే ఆధారపడి ఉంటుంది” అని సీఈవో వెల్లడించారు. ధోనీ ఇంకా తన రిటైర్మెంట్‌పై అధికారిక ప్రకటన చేయనప్పటికీ, వచ్చే సీజన్ నాటికి అతడు సీఎస్కే మేనేజ్‌మెంట్‌లో లేదా సపోర్ట్ స్టాఫ్‌లో కీలక బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందనే వార్తలకు ఈ వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూర్చాయి. ముఖ్యంగా, సీఎస్కే హెడ్ కోచ్ పదవికి ధోనీని మించిన అర్హుడు మరెవరూ లేరని మాజీలు కూడా అభిప్రాయపడుతున్నారు.

## పీసీబీ తిక్క పనులు.. పాక్ క్రికెట్‌లో అసంతృప్తి జ్వాలలు

పాకిస్థాన్ క్రికెట్ జట్టులో మరోసారి విభేదాలు భగ్గుమన్నాయి. జట్టు దీర్ఘకాలిక ఫిజియో క్లిఫ్ డీకన్‌ను పీసీబీ ఉన్నఫళంగా తొలగించడంపై పలువురు సీనియర్ ఆటగాళు ,, ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే పునఃపరిశీలించాలని వారు బోర్డును కోరుతున్నట్లు సమాచారం. ఆస్ట్రేలియాతో జరగనున్న వన్డే సిరీస్‌కు ప్రకటించిన సహాయక సిబ్బంది జాబితా నుంచి డీకన్‌ను పీసీబీ తప్పించింది. ఆయన స్థానంలో ఇఫ్తికార్ అహ్మద్‌ను కొత్త ఫిజియోగా నియమించింది. 2017 నుంచి పాక్ జట్టుతో పనిచేస్తున్న దక్షిణాఫ్రికాకు చెందిన డీకన్‌కు ఆటగాళ్లతో మంచి సంబంధాలు ఉన్నాయి. ముఖ్యంగా బౌలర్ల ఫిట్‌నెస్, గాయాల నిర్వహణలో ఆయన ఎంతో కీలకంగా వ్యవహరించేవారు. జట్టులో తరచూ తలెత్తుతున్న గాయాల సమస్యలపై బోర్డు కొత్త స్పోర్ట్స్ మెడిసిన్ డైరెక్టర్ జావేద్ ముఘల్ అసంతృప్తితో ఉన్నారని, దానికి డీకన్‌ను బాధ్యుడిని చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. రెండో టెస్టు తర్వాత డీకన్‌కు వీడ్కోలు పలకగా, ఆ కార్యక్రమంలో ఆయన కన్నీటిపర్యంతమైనట్లు సమాచారం. అయితే, బోర్డు వాదనతో ఆటగాళ్లు ఏకీభవించడం లేదు. “డీకన్ పనితీరు అద్భుతంగా ఉండేది. గాయపడిన ఆటగాళ్ల పునరావాసం చూడటం ఫిజియో బాధ్యత కాదు. అది అకాడమీలో జరుగుతుంది. చిన్న చిన్న గాయాలను ఆయన ఎంతో సమర్థంగా నిర్వహించేవారు” అని ఓ ఆటగాడు చెప్పినట్లు తెలిసింది.

## షూటింగ్ దిగ్గజం రణధీర్ సింగ్ కన్నుమూత..!

భారత దిగ్గజ షూటర్ రాజా రణధీర్ సింగ్ కన్నుమూశారు. ఆసియా క్రీడల్లో దేశానికి తొలి స్వర్ణం అందించిన ఆయన 79 ఏళ్ల వయసులో మరణించారు. గత కొన్ని రోజులుగా వృద్ధాప్య సమస్యలతో బాధ పడుతున్న రణధీర్ బుధవారం స్వగృహంలో తుదిశ్వాస విడిచి వెళ్లారు. ఆరోగ్య సమస్యల కారణంగా ఈ మధ్యే ఆసియా ఒలింపిక్ మండలి అధ్యక్షుడి పదవి నుంచి వైదొలిగిన ఆయన మరణంపై షూటర్లు విచారం వ్యక్తం చేశారు. పాటియాలోనే రాజ కుటుంబంలో జన్మించిన రాజా రణధీర్ సింగ్ కాలం చేశారు. 1978 ఆసియా క్రీడల్లో దేశానికి తొలి పసిడి అందించి రికార్డు నెలకొల్పిన ఆయన.. రెండు దశాబ్దాలపాటు పాలనాధికారిగా సేవలందించారు. 2004లో ఆసియా ఒలింపిక్ మండలి అధ్యక్షుడిగా ఎన్నికైన రణధీర్ నాలుగేళ్ల పదవీకాలం ముగియకుముందే ఆరోగ్య సమస్యలతో రాజీనామా చేశారు. వృద్ధాప్య సమస్యలు తీవ్రమవ్వడంతో ఆయన సొంతింటిలో కన్నుమూశారని భారత జాతీయ రైఫిల్ సంఘం వెల్లడించింది. ‘తీవ్రమైన బాధతో రాజా రణధీర్ సింగ్ చనిపోయారనే వార్తను తెలియజేస్తున్నాం. ఈ రోజు(మే 27 బుధవారం) ఆయన కాలం చేశారు. ఆయన ఒలింపిక్స్‌లో సత్తా చాటారు. అర్జున అవార్డు గ్రహీత అయిన రణధీర్ భారత క్రీడారంగంలోనే కాదు ఆసియాలోనూ అత్యంత గౌరవనీయులు. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీలోనూ రణధీర్ విలువైన సేవలందించారు.







# బుడ్డోడు దెబ్బేశాడు

### సన్‌రైజర్స్‌పై వైభవ్ వీరవిహారం.. బౌలింగ్ దెబ్బకొట్టిన ఆర్చర్

## క్వాలిఫయర్2కు రాజస్థాన్.. హైదరాబాద్ ఇంటికి

ఓపెనర్ల నుంచి ఆరో బ్యాటర్ వరకూ అందరూ దంచికొట్టగల సమర్థులే. ఇదివరకే తమ వైల్డ్‌ఫైర్ ఆటతో ఐపీఎల్ రికార్డు స్కోర్‌ను షేక్ చేసిన రికార్డు ఉండనే ఉంది. ఇంకేముంది ఎలిమినేటర్‌లో 244 పరుగుల లక్ష్యాన్ని సన్‌రైజర్స్ హైదరాబాద్ ఉఫ్‌మనిపిస్తుందనుకుంటే.. అనూహ్యంగా కుప్పకూలింది.

**పదిహేనేళ్ల వైభవ్ సూర్యవంశీ(97) ఊచకోతతో డీలా పడిన హైదరాబాద్‌ను జోఫ్రా ఆర్చర్(58-3) పవర్ ప్లేలోనే పడగొట్టాడు. ఓపెనర్లను ఇషాన్(33) ఔట్ చేసి మ్యాచ్‌ను రాజస్థాన్ వైపు తిప్పాడు. నితీశ్ రెడ్డి(38) కాసేపు నిలబడినా ఆరెంజ్ ఆర్మీ ఘోర ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది.**



అదిరే విక్టరీ కొట్టిన రాజస్థాన్ మే 29న క్వాలిఫయర్ 2లో గుజరాత్ టైటాన్స్‌ను ఢీకొట్టనుంది. చావోరేవో పోరులో బ్యాటర్లు, బౌలర్ల వైఫల్యంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇంటిదారి పట్టింది. ఎలిమినేటర్‌లో చెత్తాటతో రెండో టైటిల్ వేటను నాకౌట్ దశలోనే ముగించింది. ప్లాన్ ఏ, ప్లాన్ బీ, ప్లాన్ సీ ఉ ఒదన్న కమిన్స్ సేనకు వణుకు పుట్టిస్తూ వైభవ్ సూర్యవంశీ(97) సిక్సర్ల మోతతో భారీ స్కోర్ కొట్టిన రాజస్థాన్.. ఆర్చర్(58–3) నిప్పులు చెరగడంతో పవర్ ప్లేలోనే మ్యాచ్‌ను తమ గుప్పిట్లోకి తీసుకుంది. టాపార్డర్ కూలినా.. క్లాసెన్(18) ఉన్నాడులే అనే సన్‌రైజర్స్ ధైర్యాన్ని యశ్ పంజా లాగేసుకున్నాడు. క్లాసెన్‌ను అతడు ఎల్బీగా ఔట్ చేయగా ఓటమి ఖాయమైంది. భారీ విజయంతో క్వాలిఫయర్‌కు 2కు దూసుకెళ్లింది. ప్లే ఆఫ్స్‌లో ఓడితే మరో అవకాశం ఉండదని తెలిసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ పేలవ ప్రదర్శనకు మూల్యం చెల్లించుకుంది. 244 పరుగుల లక్ష్యం పెద్దది కావడంతో దూకుడుగా ఆడి తలొక అర్ధ శతకంతో గెలిపిస్తారనుకుంటే టాపార్డర్ బ్యాటర్లు చేతులెత్తేశారు. అందుకు కారణం ఆదిలోనే సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను జోఫ్రా ఆర్చర్(58–3) గట్టి దెబ్బ కొట్టడమే. ఓపెనర్ అభిషేక్ శర్మ(0)ను రెండో బంతికే డకౌట్ చేసిన అతడు.. సిక్సర్లతో వేగంగా ఆడుతున్న ఇషాన్ కిషన్(33)ను స్లో బంతితో బోల్తా కొట్టించాడు. బ్యాటింగ్ ఆర్డర్లో ముందొచ్చిన స్మరణ్ రవిచంద్రన్(1) బంతిని అంచనా వేయలేక బర్గర్ ఓవర్లో వెనుదిరిగాడు. టపటపా మూడు వికెట్లు పడిన వేళ.. ట్రావిస్ హెడ్(17), హెన్రిచ్ క్లాసెన్(18)లు ఆచితూచి ఆడబోగా.. హెడ్‌ను బౌల్డ్ చేసిన ఆర్చర్ సన్‌రైజర్స్‌ను ఓటమి వైపు నడిపాడు. కీలక వికెట్లు పడినా క్లానెస్ జతగా తెలుగబ్బాయి నితీశ్ రెడ్డి(38) జట్టును గెలిపించాలనుకున్నాడు. కానీ, యశ్ రాజ్ పంజా వేసిన 7వ ఓవర్లో క్లాసెన్ ఎల్బీగా వెనుదిరిగగా 81 వద్దే సన్‌రైజర్స్ ఐదో వికెట్ పడింది. ఉన్నంతసేపు చూడచక్కని షాట్లు ఆడిన నితీశ్‌ను జడ్డూ.. కమిన్స్(1)ను సుశాంత్ ఔట్ చేయడంతో ఇంప్యాక్ట్ సబ్ సలీల్ అరోరా(35) కాసేపు పోరాడాడు. 47పరుగుల తేడాతో గెలుపొందిన పరాగ్ సేన మే 29న ఇదే మైదానంలో గుజరాత్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.

## వైభవ్ ఊచకోత

ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ(97) రికార్డులను బద్ధలు కొడుతూ ఆడిన తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఎలిమినేటర్‌లో రాజస్థాన్ రాయల్స్ కొండంత స్కోర్ చేసింది. ముల్లన్‌పూర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పేస్ దళాన్ని వణికిస్తూ 16 బంతుల్లోనే అర్ధ శతకం బాదిన వైభవ్.. తృటిలో రికార్డు శతకాన్ని చేజార్చుకున్నాడు. అనంతరం ధ్రువ్ జురెల్(50) హాఫ్ సెంచరీతో రాణించగా 250 ప్లస్ కొట్టేలా కనిపించింది రాజస్థాన్. కానీ, డెత్ ఓవర్లలో 36 పరుగులే ఇచ్చిన హైదరాబాద్ ప్రత్యర్థిని 243కు కట్టడి చేసింది. మెరుపు అర్ధ శతకం బాదిన వైభవ్ ఒకే సీజన్‌లో క్రిస్ గేల్ పేరిట ఉన్న 59 అత్యధిక సిక్సర్ల రికార్డును అధిగమించాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 65 సిక్సర్లున్నాయి.

## తృటిలో చేజారిన రికార్డు

వైభవ్ సూర్యవంశీ సృష్టించిన విధ్వంసం మాటల్లో వర్ణించలేనిది. కేవలం 29 బంతుల్లో 97 పరుగులు చేసి, ఐపీఎల్ చరిత్రలోనే ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డుకు అత్యంత చేరువగా వచ్చిన అతను, కేవలం మూడు పరుగుల దూరంలో నిరాశగా వెనుదిరిగాడు. క్రిస్ గేల్ 30 బంతుల శతకం రికార్డును బద్దలు కొట్టాలనే లక్ష్యంతో ఆడిన వైభవ్, ఆఖరి నిమిషంలో వికెట్ సమర్పించుకున్నాడు. ఒక్క బంతి తేడాతో రికార్డు చేజార్చుకున్నాడు. అయితే, ఈ ఇన్నింగ్స్‌తో వైభవ్ పలు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఒక ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు (61) బాదిన ఆటగాడిగా క్రిస్ గేల్ (59) రికార్డును బద్దలుకొట్టాడు. అలాగే, ఒక సీజన్ పవర్‌ప్లేలో అత్యధిక పరుగులు (490) చేసిన ఆటగాడిగా డేవిడ్ వార్నర్ (467)ను అధిగమించి అగ్రస్థానానికి చేరుకున్నాడు. పవర్‌ప్లేలోనే 8 సిక్సర్లు కొట్టి ఈ ఘనత సాధించిన తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు.



## గ్రాండ్ మాస్టర్ గుకేశ్ ఓటమి

నార్వే చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ ఛాంపియన్ డి.గుకేశ్ క్లాసికల్ రౌండ్–2 మ్యాచ్‌లో అమెరికా ఆటగాడు వెస్లీ సోపై గుకేశ్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. ఏకంగా 116 ఎత్తుల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ మారథాన్ పోరులో గుకేశ్ విజయం సాధించేలా కనిపించాడు. అయితే వెస్లీ అద్భుతంగా డిఫెన్స్ చేసి మ్యాచ్‌ను డ్రాగా ముగించగలిగాడు. తర్వాత ఫలితం కోసం నిర్వహించిన ‘ఆర్మగెడాన్’ (టై బ్రేకర్) మ్యాచ్‌లో వెస్లీ పైచేయి సాధించి 1.5 పాయింట్లు ఖాతాలో వేసుకోగా, గుకేశ్ కేవలం ఒక పాయింట్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. సుదీర్ఘ పోరాటం తర్వాత ఓటమి పాలవడంతో గుకేశ్ తీవ్ర నిరాశకు గురయ్యాడు. మ్యాచ్ అనంతరం బ్రాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో తన అసంతృప్తిని దాచుకోలేకపోయాడు. దీనికి తోడు వెస్లీ మాట్లాడుతూ.. గుకేశ్ ప్రస్తుత రేటింగ్ అతడి అసలు ప్రతిభకు అద్దం పట్టడం లేదంటూ కాస్త వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కేవలం 19 ఏళ్ల వయసులోనే ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన గుకేశ్‌కు ఈ ఓటమి మానసికంగా కాస్త నిరాశ కలిగించింది.

### గాయంతోనూ గెలిచిన ఫిరౌజా

టోర్నీలోని ఇతర మ్యాచ్‌ల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. అలిరెజా ఫిరౌజా చీలమండ గాయంతో బాధపడుతూ, చేతికర్రల సాయంతో నడుస్తూనే భారత ఆటగాడు ప్రజ్ఞానందపై ఘన విజయం సాధించి తన ఫామ్‌ను చాటుకున్నాడు. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ సైతం జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్ చేతిలో ఓడిపోయే ప్రమాదం నుంచి తప్పించుకుని, ఆర్మగెడాన్ రౌండ్‌లో ఈ టోర్నీలో తన మొదటి విజయాన్ని నమోదు చేశాడు.




## గణాంకాలే మా విజయ రహస్యం: భువనేశ్వర్

డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ.. మంగళవారం జరిగిన తొలి క్వాలిఫయర్‌లో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తుగా ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. బెంగళూరు పేసర్ భువనేశ్వర్ సంచలన బౌలింగ్‌తో ప్రత్యర్థి జట్ల బ్యాటర్లను బెంబేలెత్తిస్తూ జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడు. గుజరాత్‌తో క్వాలిఫయర్‌లో రెండు వికెట్లు పడగొట్టిన భువీ మ్యాచ్ అనంతరం మాట్లాడాడు. బ్యాటర్లను ఎలా వికెట్ల ముందు దొరకబుచ్చుకోవాలి, ఏవిధంగా క్లీన్‌బౌల్డ్ చేయాలనే తమ బౌలింగ్ ప్రణాళికల గురించి వివరించాడు. తమ విజయంలో డేటా (గణాంకాలు) ఎలాంటి పాత్ర పోషిస్తుందో తెలిపాడు. “తెర వెనుక జరిగిన ప్రణాళికకు చాలావరకు ఘనత దక్కుతుంది. మేం (నేను, జోష్ హేజిల్‌వుడ్) మా అనుభవాన్ని రంగరించాం.

ఈవార్తలు
ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
గురువారం 28-5-2026, జగిత్యాల


నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# వరి కొనుగోళ్లలో అనాలోచిత విధానాలు

తెలంగాణకు వెన్నెముక లాంటి వ్యవసాయ రంగం ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కోట్లాది రూపాయల బడ్జెట్ అంచనాలు, ఆర్భాటపు ప్రకటనలు ఎలా ఉన్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ఐకేపీ కేంద్రాల వద్ద వరి కుప్పల పక్కన రైతుల కన్నీళ్లే కనిపిస్తున్నాయి. యాసంగి (రబీ) సీజన్ ముగిసి, పంట చేతికి వచ్చి వారాలు గడుస్తున్నా, ధాన్యం సేకరణ ప్రక్రియ నత్తనడకన సాగడం రాష్ట్ర ప్రభుత్వ ముందస్తు ప్రణాళికా లోపానికి మరియు అనాలోచిత నిర్ణయాలకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రభుత్వం రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, దాదాపు 80 శాతానికి పైగా ప్రక్రియ పూర్తయిందని గణాంకాలు చెప్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి దానికి భిన్నంగా ఉంది. ప్రతిపక్షాలు మరియు రైతు సంఘాల ఆరోపణల ప్రకారం చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ 30 శాతానికి మించి కొనుగోళ్లు జరగలేదు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సదుపాయాలైన తార్పాలిన్లు, గన్నీ బ్యాగులు (గోనె సంచులు), మరియు తూకం యంత్రాల కొరత తీవ్రంగా వేధిస్తోంది. మే నెల చివరి వారంలో ఆకాశం మేఘావృతమై, అకాల వర్షాలు కురుస్తున్న తరుణంలో, రోడ్లపై, ఐకేపీ కేంద్రాల్లో ఓపెన్ యార్డుల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవు తోంది. తార్పాలిన్లు లేక రైతులు తమ ప్రాణప్రదమైన పంటను కాపాడుకోవడానికి రాత్రింబవళ్లు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ధాన్యంలో తేమ శాతం నెపంతో క్వింటాలుకు 3 నుండి 5 కిలోల వరకు తరుగు తీస్తూ మిల్లుల యజమానులు రైతులను నిలువునా దోచుకుంటున్నారు. దీనిని అరికట్టడంలో స్థానిక యంత్రాంగం మరియు పౌరసరఫరాల శాఖ పూర్తిగా వైఫల్యం చెందాయి. ఒకవైపు 70 నుండి 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తూ, మరోవైపు మిల్లులకు ధాన్యం తరలింపులో జాప్యం చేయడం వల్ల కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. రవాణాకు అవసరమైన లారీల కొరత, హమాలీ చార్జీల వివాదాల వల్ల ప్రక్రియ మరింత ఆలస్య మైంది. సన్న బియ్యానికి ఇస్తామన్న రూ. 500 బోన స్ అమలుపై కూడా స్పష్టత కరువై, రైతులు దళా రులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రస్తు తం వరి కొనుగోళ్లు కేవలం ఒక పరిపాలనా ప్రక్రియగా కాకుండా, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య, అధికార-విపక్షాల మధ్య రాజకీయ యుద్ధంగా మారాయి. కేంద్రం మద్దతు ధర ఇస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం సేకరించడం లేదని ఒకరు, కేంద్రం సహకారం లేకపోయినా తామే భరిస్తున్నామని మరొకరు చేసుకుంటున్న పరస్పర ఆరోపణల మధ్య అసలైన రైతు నలిగిపోతున్నాడు. ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపానికి రైతుల శ్రమ బలికావడం అత్యంత విచారకరం. వ్యవసాయాన్ని పండుగ చేస్తామని చెప్పే పాలకులు, కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో తక్షణ చర్యలు చేపట్టాలి. జాప్యాన్ని నివారించడానికి కలెక్టర్ల పర్యవేక్షణలో కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు, గోదాములకు ధాన్య తరలింపును యుద్ధప్రాతిపదికన వేగవంతం చేయాలి. రైస్ మిల్లుల వద్ద రైతులను ఇబ్బంది పెట్టే తరుగు దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలి. అకాల వర్షాల నుండి పంటను కాపాడేందుకు అవసరమైన అన్ని కేంద్రాల్లో తార్పాలిన్లను, గన్నీ బ్యాగులను తగినంత సంఖ్యలో అందుబాటులో ఉంచాలి. ధాన్యం విక్రయించిన రైతులకు ఖాతాల్లో బ్యాంక్ చెల్లింపులు ఆలస్యం కాకుండా వెంటనే జమ అయ్యేలా చూడాలి. రైతు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామన్న హామీలు కాగితాలకే పరిమితం కాకూడదు. అన్నదాతలు రోడ్లపై పగలు ఎండకు ఎండి, రాత్రి చలికి వణుకుతూ తమ పంటను కాపాడుకునే పరిస్థితి మారాలి. ప్రభుత్వం తన అనాలోచిత, తాత్కాలిక నిర్ణయాలను పక్కనబెట్టి, శాశ్వత మరియు పారదర్శక కొనుగోలు విధానాన్ని అమలు చేసినప్పుడే తెలంగాణ రైతాంగానికి నిజమైన భరోసా లభిస్తుంది.

# పీఆర్ స్టంట్ల పాలన



**ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ పాలన ముగిసి, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు పెద్ద ఎత్తున మార్పును ఆశించారు. రాష్ట్రాన్ని ఎంతో గొప్పగా ప్రగతిపథంలో నడిపిస్తారనే నమ్మకంతో స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, ప్రభుత్వం ఏర్పాటైన ఈ కాలంలో ఆశించిన స్థాయిలో క్షేత్రస్థాయి మార్పులు కనిపించడం లేదనే అసంతృప్తి ప్రజల్లో వ్యక్తమవుతోంది.**

పాలనాపరమైన ఫలితాల కంటే ప్రచార ఆర్భాటాలే ఎక్కువగా ముందుకొస్తున్నాయనే విమర్శలు ఇప్పుడు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఏ చిన్న కార్యక్రమం చేపట్టినా, దానికి భారీ ఎత్తున మీడియా హైప్ కల్పించడం ప్రస్తుత ప్రభుత్వ శైలిగా మారింది. అధునాతన ప్రచార తంత్రాలు, సోషల్ మీడియా మేనేజ్‌మెంట్ ద్వారా అద్భుతాలు జరిగిపోతున్నాయనే భ్రమను కల్పించే ప్రయత్నం జరుగుతోంది. కానీ, కేవలం ప్రచారం ద్వారా సృష్టించే మైలేజ్ ఎక్కువ కాలం నిలవదు. ప్రభుత్వం సాధించిన నిజమైన విజయాలు ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చినప్పుడే కనిపిస్తాయి. నిరుద్యోగ సమస్య, పెరిగిన నిత్యావసరాల ధరలు, రోడ్ల దుస్థితి, మౌలిక వసతుల కల్పన వంటి ప్రాథమిక అంశాలపై ప్రజలు ఇప్పటికీ స్పష్టమైన మార్పు కోసం ఎదురుచూస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రచారానికి, పరిపాలనకు మధ్య స్పష్టమైన తేడా ఉంటుంది. ప్రచారం ఎన్నికల వరకే పరిమితం కావాలి, అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యం అంతా ప్రజా సంక్షేమం, అభివృద్ధిపైనే ఉండాలి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను ఎత్తిచూపడం కంటే, వాటిని సరిదిద్ది మెరుగైన పాలనను అందించడమే చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం కావాలి. మీడియా సృష్టించే హైప్ తాత్కాలిక సంతోషాన్ని ఇవ్వగలదేమో కానీ, ప్రజలు పెట్టుకున్న ఆశలను నెరవేర్చలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలను పక్కనబెట్టి, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి.

చిన్నబోయిన సుధీర్ చంద్ర, గుంటూరు

**పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఘనంగా జరిగింది. వివిధ రంగాల్లో దేశానికి, సమాజానికి సేవ చేసిన వారిని గౌరవిస్తూ పద్మ అవార్డులు అందించే సంప్రదాయం 1954లో మొదలైంది. 1978, 1979, 1993, 1997 మినహా ప్రతియేటా ఈ కార్యక్రమం జరుగుతోంది. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ పురస్కారాలు పొందడం ఒక గొప్ప గౌరవం. అందుకే, ప్రతియేటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా చేసే పురస్కారాల ప్రకటన పట్ల పెద్దఎత్తున ఆసక్తి నెలకొంటుంది.**



# అ'సామాన్యులకు' అసలైన గౌరవం

పద్మ పురస్కారాలు ఇచ్చే సంప్రదాయం చాలా ఏళ్లుగా కొనసాగుతున్నప్పటికీ గతంలో అవి ప్రముఖులకు, సమాజంలో అప్పటికే పేరు ప్రఖ్యాతలు పొందిన వారికే ఎక్కువగా దక్కేవి. గత కొన్నేళ్లుగా ఈ పద్ధతి మారింది. మట్టిలో మాణిక్యాలను కేంద్ర ప్రభుత్వం వెలికితీస్తోంది. సమాజానికి నిస్వార్థ సేవలు అందిస్తున్న సామాన్యులకు సరైన గౌరవాన్ని అందిస్తోంది. అసలైన అర్హులకు పురస్కారాలు వెతుక్కుంటూ వస్తాయనే భావనను నిజం చేస్తోంది. అందుకే, ఈ పురస్కారాలు ఇప్పుడు ప్రజా పురస్కారాలు(పీపుల్స్ పద్మ)గా రూపాంతరం చెందాయి.

ఈ ఏడాది పద్మ అవార్డులకు ఎంపికైన వారిలో ఎందరో అజ్ఞాత మహనీయులు ఉన్నారు. వీరిలో ఒకరు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బుధ్రి తాతి. నక్సల్ ప్రభావిత బస్తర్ జిల్లాలో ఆదివాసీల కోసం ఆమె 36 ఏళ్లుగా సేవ చేస్తున్నారు. రోడ్లు సైతం లేని 570 గిరిజన గ్రామాలకు ఆమె కాలినడకన వెళ్తూ సేవలందించారు. ఆదివాసీ పిల్లల కోసం ఆమె ఉచిత విద్యను అందిస్తున్నారు. ఈ ఏడాది ఆమెకు పద్మశ్రీ పురస్కారం వరించింది.

కర్నాటకలోని మాండ్య జిల్లాకు చెందిన అంకెగౌడ కథ కూడా ఇలాంటిదే. ఒకప్పుడు బస్ కండక్టర్‌గా పనిచేసిన ఆయన దాదాపు 20 లక్షల పుస్తకాలతో ప్రపంచంలోనే అతిపెద్ద ఉచిత లైబ్రరీని ఏర్పాటుచేశారు. విద్యారంగంలో ఆయన సేవలను గుర్తించిన కేంద్రం పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేసింది. నవజాత శిశువుల మరణాలను తగ్గించే లక్ష్యంతో ఆసియాలోనే మొదటి హ్యూమన్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటుచేసిన మహారాష్ట్రకు చెందిన డాక్టర్ అర్మిదా ఫెర్నాండెజ్ కూడా పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి పాడి పరిశ్రమ రంగంలో, గ్రామీణ రైతుల జీవితాలను బాగుపర్చేందుకు విశేష సేవలు అందించిన మామిడి రామారెడ్డికి మరణానంతరం పద్మశ్రీ గౌరవం దక్కింది. ఇలా చెప్పుకుంటూ వెళ్తే.. ప్రతియేటా పద్మ పురస్కారాల జాబితాలో పదుల సంఖ్యలో మట్టిలో మాణిక్యాలు కనిపిస్తారు.

వీరంతా నిస్వార్థ సమాజ సేవకులు. అవార్డులు, రివార్డులను ఆశించి వీరు ఎన్నడూ పనిచేయలేదు. సమాజహితం కోసం నిశబ్దంగా తమ జీవితాలను ధారపోశారు. గతంలో ఇలాంటి చాలామంది ఆదర్శాల గురించి కొంతమందికే తెలిసేది. ఇప్పుడు పద్మ పురస్కారాల ద్వారా సమాజం కోసం వీరు చేసిన త్యాగాలు దేశమంతా తెలుస్తున్నాయి. కోట్లాది మంది భారతీయులకు స్ఫూర్తి నింపుతున్నాయి. ఈ అన్‌సంగ్ హీరోస్ ఇప్పుడు ప్యాన్ ఇండియన్ హీరోస్‌గా మారుతున్నారు.

**- సందీప్**

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.